


Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 01 | సంచిక : 305 | శుక్రవారం 22 మే 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



## నిందితులకు అభ్యంతరం లేకపోతే విచారణలు కొనసాగించవచ్చు !

- దేశద్రోహం కేసుల్లో సుప్రీం వ్యాఖ్యలు

2



## ముగిసిన ప్రధాని మోడీ విదేశీ పర్యటన

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ప్రధాని మోడీ ఐదు దేశాల పర్యటన నేటితో ముగియనుంది. గురువారం ఇండియాకు చేరుకోనున్నారు. మే 15న మొదలైన మోడీ విదేశీ టూర్ వారం రోజులపాటు

- మిగతా 2లో..

## ఆర్థిక వ్యవస్థలో ప్రధాని మోడీకి జ్ఞానం అవసరం

- కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ప్రతినిధి జైరామ్ రమేష్

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ప్రధాని మోడీ జ్ఞానేష్ సాయంతో ఎన్నికల్లో విజయం సాధిస్తున్నారని, ఆర్థిక వ్యవస్థలోనూ ఆయనకు జ్ఞానం అవసరమని

- మిగతా 2లో..



# ‘స్త్రీ శక్తి’ థీమ్‌తో మహానాడు

- 20 తీర్మానాలను చేపట్టాలని టిడిపి పొలిట్ బ్యూరో నిర్ణయం
- పండుగలా నిర్వహించాలన్న సీఎం చంద్రబాబు



అమరావతి - సూర్య వాస్తవం

స్త్రీ శక్తి థీమ్‌తో మహానాడు-2026ను నిర్వహించాలని టిడిపి పొలిట్ బ్యూరో నిర్ణయించింది. ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన వర్చువల్‌గా గురువారం జరిగిన పొలిట్‌బ్యూరో సమావేశంలో ఈ నెల 27, 28 తేదీల్లో జరగనున్న మహానాడులో 20 తీర్మానాలు ప్రవేశపట్టాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో చంద్రబాబుతో పాటు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఉండవల్లి క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొనగా, మిగిలిన సభ్యులు వేర్వేరు ప్రదేశాల నుంచి సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రానికి చెందిన 10 తీర్మానాలు, 4 తెలంగాణ, 1 అండమాన్‌కు చెందిన తీర్మానాలను ప్రవేశపెట్టాలని, వీటితో పాటు మరో 4 ఉమ్మడి తీర్మానాలతో కీలకమైన రాజకీయ తీర్మానం ప్రవేశపెట్టాలని ఈ సమావేశం నిర్ణయించింది. స్త్రీ శక్తి థీమ్ తో మహానాడును నిర్వహించాలని నిర్ణయించడమే కాకుండా దాన్ని ప్రతిఫలించేలా ఉండాలని చంద్రబాబు ఆదేశించారు. పార్టీ ఆవిర్భావం నుంచి మహిళలకు, మహిళా సాధికారతకు, వారికి హక్కులు కల్పించే విషయంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారనే అంశాన్ని వివరించాలని సూచించారు. ప్రతి పథకంలోనూ మహిళలను భాగస్వాములను చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వీటితో పాటు ప్రభుత్వం అమలు చేసే పథకాలు, చేపడుతోన్న కార్యక్రమాలు, చేస్తున్న అభివృద్ధి,

- మిగతా 2లో..



## మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి రేవంత్ రెడ్డి నివాళి

హైదరాబాద్ - సూర్య వాస్తవం

మహిళా రిజర్వేషన్ల ముసుగులో కేంద్ర ప్రభుత్వం రాజకీయాలు చేయాలనుకుంటే సహించేది లేదని, తక్షణమే ప్రత్యేక పార్లమెంటు సమావేశాలను ఏర్పాటు చేసి లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే ఈ బిల్లుకు ప్రతిపక్షాల ‘ఇండియా’ కూటమి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆయన స్పష్టం చేశారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా

- మిగతా 2లో..



## తమిళనాడులో కేబినెట్ విస్తరణ

- 59 ఏళ్ల తర్వాత మంత్రివర్గంలో కాంగ్రెస్

# కేటగిరీలుగా కార్మికులు

- అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్‌గా విభజన
- కోటి 11 లక్షల మందికి మేలు
- జూన్ 1 నుంచి పెంచిన కనీస వేతనాలు అమలు
- విలేకర్ల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్- సూర్య వాస్తవం

కార్మికుల కనీస వేతనాలపై తమ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని కార్మికులను అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్ అనే నాలుగు కేటగిరీలుగా విభజించామని తెలిపారు. తద్వారా మొత్తం కోటి 11 లక్ష?ల మందికి లబ్ది చేకూరనుందని చెప్పారు. జూన్ 1 నుంచి ఈ నిర్ణయం అమలవుతుందని వివరించారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి సీఎం మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో

- మిగతా 2లో..





## నీట్ పేపర్ లీకేజీ.. రాజస్థాన్‌లో కాంగ్రెస్ ఆందోళన

హైదరాబాద్ - సూర్య వాస్తవం

రాజస్థాన్ కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన చేపట్టారు. నీట్ పేపర్ లీకేజీని ఖండిస్తూ జైపూర్‌లో భారీ ర్యాలీ తీశారు. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర పార్ధాన్ రాజీనామా చేయాలని

- మిగతా 3లో..



## భగీరథ్ ముందస్తు బెయిల్‌పిటిషన్ తిరస్కరణ

2

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి



## సెప్టెంబర్ కల్లా పనులు

- ఎంఓయులపై సీఎం ఆదేశం

3

## రాష్ట్రంలో మోసపూరిత పాలన

- అమరావతి నిర్మాణం పేరుతో భారీ స్కామ్- వైసీపీ అధినేత జగన్

అమరావతి - సూర్య వాస్తవం

రాష్ట్రంలో ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చంద్రబాబు ప్రభుత్వం మోసపూరిత పాలన కొనసాగిస్తోందని వైసిపి అధ్యక్షుడు, మాజీ సిఎం వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తూ ‘జంగిల్ రాజ్’ నడుపుతున్నారని విమర్శలు చేశారు. ‘బాబు ష్యూరిటీ -- మోసం గ్యారంటీ’ అన్నది ప్రతిరోజూ రుజువవుతోందన్నారు.

- మిగతా 2లో..



# నిందితులకు అభ్యంతరం లేకపోతే విచారణలు కొనసాగించవచ్చు !

## - దేశద్రోహం కేసుల్లో సుప్రీం వ్యాఖ్యలు

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

నిందితులకు అభ్యంతరం లేకపోతే దేశద్రోహం కేసుల్లో విచారణలు కొనసాగించవచ్చని సుప్రీంకోర్టు గురువారం పేర్కొంది. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి)లోని సెక్షన్ 124ఎ కింద రాజద్రోహం నేరానికి సంబంధించిన విచారణలు, అప్పీళ్ళతో కోర్టులు ముందుకు సాగవచ్చని తెలిపింది. దేశవ్యాప్తంగా రాజద్రోహం కేసుల్లో విచారణలు నిలిపివేసిన నాలుగేళ్ల తర్వాత సుప్రీం ఈ వ్యాఖ్యలు చేసింది. రాజద్రోహం అభియోగాల కేసుకు సంబంధించి గత 17ఏళ్ళుగా జైల్లో వున్న పిటిషనర్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారిస్తూ ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోమాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ పంచోలీలతో కూడిన బెంచ్ పై వివరణ జారీ చేసింది. సెక్షన్ 124 ఎ కింద మోపిన అభియోగంతో సహ మొత్తంగా తన క్రిమినల్ అప్పీల్‌ను విచారిస్తే తనకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన తెలిపారు. నిందితులకు అభ్యంతరాలు లేనపుడు కోర్టులకు ఇటువంటి విషయాల్లో వాటి యోగ్యత ఆధారంగా, చట్టానికి అనుగుణంగా పరిష్కరించడానికి కోర్టులకు ఎలాంటి అవరోధాలు వుండరాదని బెంచ్ పేర్కొంది. వలసకాలం నాటి నిబంధనను పున:పరిశీలించేందుకు కేంద్రం హామీ ఇచ్చిన ప్రక్రియ పూర్తయ్యేవరకు న్యాయస్థానాల ముందు పెండింగ్‌లో వున్న రాజద్రోహం కేసులన్నింటి విచారణలను 2022 మే 11న సుప్రీం కోర్టు నిలిపివేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

# తమిళనాడులో కేబినెట్ విస్తరణ

## - 59 ఏళ్ల తర్వాత మంత్రివర్గంలో కాంగ్రెస్

చెన్నై - సూర్య వాస్తవం

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ గురువారం తన కేబినెట్ విస్తరించారు. ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో పాటు గురువారం మొత్తంగా 23 మంది ఎమ్మెల్యేలను క్యాబినెట్ లో చేర్చారు. తాజా విస్తరణతో మంత్రుల సంఖ్య 33మందికి చేరింది. అలాగే, 59 ఏళ్ల తర్వాత తమిళనాడు ప్రభుత్వంలో కాంగ్రెస్ భాగస్వామ్యం కావడం గమనార్హం. అలాగే, తమిళనాడు చరిత్రలోనే ఇది మొట్టమొదటి సంకీర్ణ ప్రభుత్వం. చెన్నైలోని లోక్ భవన్ లో గవర్నర్ రాజేంద్రర్ అర్లేకర్ కొత్త మంత్రులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ జె.సి.డి. ప్రభాకర్, తమిళనాడుకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) ఇన్‌ఛార్జ్ గిరీష్ చోడంకర్, తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టిఎన్‌సిసి) అధ్యక్షుడు కె. సెల్వపెరుంతగై, విసికె అధ్యక్షుడు థోల్ తిరుమావళవన్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి. షణ్ముగం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎం. వీరపాండియన్ తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 10న ముఖ్యమంత్రి విజయ్, మరో తొమ్మిది మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే.

# భగీరథ్ ముందస్తు బెయిల్‌పిటిషన్ తిరస్కరణ

హైదరాబాద్ - సూర్య వాస్తవం

హైదరాబాద్‌లోని పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి సాయి భగీరథ్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించు కునేందుకు హైకోర్టు అను మతి ఇచ్చి, ఆ వ్యాజ్యాన్ని కొట్టేసింది. ఈ నెల 8న పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు అయింది. అనంతరం పరారీలో ఉన్న భగీరథ్ హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మాధవీదేవి గత శుక్రవారం అర్ధరాత్రి విచారణ నిర్వహించి తీర్పును రిజర్వులో ఉంచారు. తీర్పు వెలువడే వరకు అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని భగీరథ్ తరపు న్యాయవాది చేసిన వినతిని కోర్టు తిరస్కరించింది. ఇదే సమయంలో శనివారం భగీరథ్ పోలీసుల అదుపులోకి వెళ్లారు. తనను పోలీసులు అరెస్టు చేసిన నేపథ్యంలో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఉత్తర్వులు ఇవ్వడం ప్రయోజనం ఉండదని పేర్కొంటూ, పిటిషన్‌ను ఉపసంహరించు కునేందుకు అనుమతి ఇవ్వాలని ఆయన తరపు న్యాయవాది హైకోర్టుకు లేఖ సమర్పించారు. ఈ అభ్యర్థనపై గురువారం విచారణ చేపట్టిన జస్టిస్ మాధవీదేవి పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించారు. అయితే సంబంధిత దిగువ కోర్టులో రెగ్యులర్ బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేసుకునే స్వేచ్ఛను పిటిషనర్‌కు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నౌహీరా షేక్‌కు చుక్కెదురు పెట్టుబడిదారులను మోసం చేశారంటూ ఈడీ నమోదు చేసిన కేసులో నిందితురాలు నౌహీరా షేక్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. ఈడీ ప్రత్యేక కోర్టు జారీ చేసిన నాన్‌బెయిలబుల్ వారెంట్ అమలును నిలిపివేతకు నిరాకరించింది. ఈ మేరకు జస్టిస్ ఈవీ వేణుగోపాల్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 7న ఈడీ ప్రత్యేక కోర్టు నౌహీరా షేక్‌పై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. దీనిని రద్దు చేయాలని కోరుతూ ఆమె హైకోర్టును ఆశ్రయించారు. ఆస్తులను వేలం వేసి బాధితులకు ఇచ్చేందుకు పిటిషనర్ సిద్ధంగా ఉన్నారని, విచారణకు సహకరిస్తున్నారని, ఎన్‌బిడ బ్ల్యూను రద్దు చేయాలని న్యాయవాది కోరారు. దీనిపై హైకోర్టు, దిగువ కోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. ఈడీకి నోటీసులు ఇచ్చి విచారణను వాయిదా వేసింది.

# 'స్త్రీ శక్తి' థీమ్‌తో మహానాడు

(మొదటి పేజీ తరువాయి)

వస్తున్న పెట్టుబడులు వంటి వాటిపై కూలంకుషంగా చర్చించాలని ఆదేశించారు. మన దేశం -- మన బాధ్యత పేరుతో పొదుపు చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రత్యేకంగా చర్చ జరపాలని సూచించారు. రాష్ట్రంలో వైసిపి అరాచకాలను, కుట్రలను బహిర్గతం చేయడంతో పాటు ప్రజల్లో అవగాహన పెంచేలా ఉండాలని సమావేశం అభిప్రాయం వ్యక్తం చేసింది. అన్ని క్లస్టర్లల్లో ఎన్టీఆర్ విగ్రహం పెట్టి మహానాడును ప్రారంభించాలని పొలిట్ బ్యూరో సమావేశంలో నిర్ణయించింది. టిడిపి చరిత్ర, ఎన్టీఆర్ సిద్దాంతాలపై నేటి తరానికి తెలిసేలా మహానాడులో ప్రజెంటేషన్స్ ఇవ్వాలని తెలిపింది. హైబ్రీడ్ పద్దతుల్లో ఈసారి మహానాడు జరుగుతున్నా దాని స్ఫూర్తి మాత్రం కొనసాగాలని, పండుగలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని చంద్రబాబు సూచించారు. రెండు రోజుల ముందు నుంచి ప్రతి ఇంటిపై టిడిపి జెండా ఎగరేయాలని చెప్పారు. పార్టీ అగ్రనాయకత్వం మొదలుకుని క్షేత్ర స్థాయి కార్యకర్త వరకు మహానాడులో భాగస్వాములను చేసేలా నిర్వహించాలని ఆదేశించారు. టిడిపి కార్యాలయం నుంచి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, మంత్రి కె అచ్చెన్నాయుడు పాల్గొనగా, మిగిలిన సభ్యులు వర్చువల్‌గా హాజరయ్యారు.

# కేటగిరీలుగా కార్మికులు

(మొదటి పేజీ తరువాయి)

కనీస వేతనాల విషయంలో రాష్ట్రంలోని కార్మికులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. అందుకే తమ ప్రభుత్వం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో క్యాబినెట్ సబ్ కమిటీని నియమించిందని గుర్తు చేశారు. ఆ కమిటీ ఇచ్చిన నివేదికపై చర్చించిన ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుందని వివరించారు. రాష్ట్రంలోని జోన్లను మూడు భాగాలుగా విభజించామని తెలిపారు. జోన్-1లో మున్సిపల్ కార్పొరేషన్లు, జోన్-2లో మున్సిపాలిటీలు, జోన్-3లో గ్రామీణ ప్రాంతాలను తీసుకుని కనీస వేతనాలను నిర్ణయించామని వెల్లడించారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మొట్టమొదటిసారిగా కార్మికుల సంక్షేమం కోసం తీసుకున్న గొప్ప నిర్ణయం ఇదని పేర్కొన్నారు.

ఈ విషయంలో గత ప్రభుత్వం తన బాధ్యతను గాలికొదిలేసిందని విమర్శించారు. కానీ తమ ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించిందని చెప్పారు. కార్మిక నాయకుడైన వెంకటస్వామి వారసుడిగా మంత్రి వివేక్ మంచి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. అమెరికా ఆలోచనను వీడండి... రాష్ట్రంలోని యువతకు సీఎం ఈ సందర్భంగా ఓ సూచన చేశారు. ఐటీ రంగంలో ఉండాలి, అమెరికా వెళ్లాలనే ఆలోచనలను విరమించుకోవాలని కోరారు. ఉద్యోగాలు రాని, ఉపాధి అవకాశాలు లేని చదువులు వ్యర్థమని వ్యాఖ్యానించారు. సాంకేతిక నైపుణ్యంతో జర్మనీ, జపాన్, సింగపూర్ లాంటి ఇతర దేశాల్లో అనేక అవకాశాలను అందిపుచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసమే రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి, యువతను ప్రోత్సహిస్తోందని తెలిపారు.

**బీజేపీది రాజకీయ కోణం...**

ప్రజా సమస్యలను, దేశాల మధ్య యుద్ధాన్ని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాజకీయ కోణంలోనే చూస్తోందని సీఎం విమర్శించారు. అంతేతప్ప వాటి పరిష్కారానికి ప్రయత్నించటం లేదని దుయ్యబట్టారు. అందుకే ఎన్నికలు కాగానే పెట్రోల్, డీజిల్ ధరలను రోజుకోసారి పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ తమ ప్రభుత్వం ప్రతీ అంశాన్ని దీర్ఘకాలిక దృష్టితోనే చూస్తోందని చెప్పారు. అందుకే కార్మికుల కనీస వేతనం పెంపు పై నిర్ణయం తీసుకున్నామని వివరించారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ 80 శాతం పూర్తయ్యిందని చెప్పారు. మిగతా ధాన్యాన్ని కూడా త్వరలోనే కొనుగోలు చేస్తామని హామీనిచ్చారు.

**బీఆర్ఎస్ వి శవరాజకీయాలు**

ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ రాద్ధాంతం చేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఆ పార్టీ నేతలు మానవత్వం మరిచిపోయి వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల విషయంలో బీఆర్ఎస్ శవ రాజకీయాలు చేస్తోందని దుయ్యబట్టారు. రాజకీయాల కోసం మరీ ఇంత దిగజారి వ్యవహరిస్తారా? అని ప్రశ్నించారు. రైతులపై ప్రతిపక్షాలకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలని అన్నారు. పోక్సో కేసులో ఏదో సాధించినట్టు బీఆర్ఎస్ నేతలు శాడిస్టుల్లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

ఆ కేసులో బండి భగీరథ్ ను పోలీసులే అరెస్టు చేశారని తెలిపారు. బండి సంజయ్ తన కుమారుడిని తానే అప్పగించానని చెబుతున్నారు.. కానీ ఇంట్లోనే ఎందుకు ఆ పని చేయలేదని ప్రశ్నించారు. ఇలాంటి వాస్తవాలను పక్కనబెట్టిన బీఆర్ఎస్ నేతలు అవాకులు చెవాకులు పేలుతున్నారని విమర్శించారు.

రాజకీయాలు చేయాలనుకుంటే ఎన్నికల్లో ఓడించాలి తప్ప దిగజారి ప్రవర్తించొద్దని హితవు పలికారు. కేటీఆర్ బావమరిది ఫామ్ హౌస్ లో డ్రగ్స్ దొరికినప్పటికీ నోటీసులు ఇచ్చిన తర్వాతే విచారణ చేపట్టామని తెలిపారు. బండి భగీరథ్ విషయంలోనూ ఇలాగే వ్యవహరించామని చెప్పారు. పోక్సో కేసులో పోలీసులు ప్రొసీజర్ ప్రకారమే వ్యవహరిస్తున్నారని స్పష్టం చేశారు.

**ఇంకా కల్వకుంట్ల రాజ్యాంగంలోనే ఉన్నారా?**

మాజీ మంత్రి కేటీఆర్ తాను ఇంకా కల్వకుంట్ల రాజ్యాంగంలోనే ఉన్నట్టు భ్రమ పడుతున్నారని సీఎం ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి కుర్చీ నుంచి కేసీఆర్ దిగిపోయి చాలా రోజులైందని ఎద్దేవా చేశారు. తన పార్టీ మీటింగ్ కోసం జగిత్యాలకు వెళ్లిన కేసీఆర్.. రాష్ట్రంలో ఇంత పెద్ద సంఘటన జరిగితే ఎందుకు బయటకు రాలేదని నిలదీశారు.

**సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం...**

కులగణన విషయంలో సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ నిర్ణయాన్ని సర్వోన్నత న్యాయస్థానం కూడా సమర్థించడం తమకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో జనగణనతోపాటు కులగణనను చేపట్టడమేగాక అన్ని వివరాలను ప్రజల ముందుంచామని వివరించారు. ఈ విషయంలో తెలంగాణ దేశానికే దిక్సూచిగా నిలిచిందన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కూడా తక్షణమే జనగణనలో కులగణన చేర్చటం ద్వారా బలహీన వర్గాలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలని డిమాండ్చే చెశారు.?

**ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాల పెంపుదల ఇలా**

1జోన్ 1 లో అన్ స్కిల్డ్ కేటగిరీలో కనీస వేతనం ప్రస్తుతం రూ.12,750 నుంచి రూ.16 వేలు, సెమీ స్కిల్డ్ రూ.13,152 నుంచి రూ.17 వేలు, స్కిల్డ్ రూ.13,772 నుంచి రూ.18,500, హైలీ స్కిల్డ్ కేటగిరీలో రూ.14,607 నుంచి రూ.20 వేలకు పెంచారు.

2 జోన్ 2 లో అన్ స్కిల్డ్ కేటగిరీలో కనీస వేతనం రూ.12,470 నుంచి రూ.15 వేలకు, సెమీ స్కిల్డ్ రూ.13,152 నుంచి రూ.16 వేలకు, స్కిల్డ్ రూ.13,772 నుంచి రూ.17,500, హైలీ స్కిల్డ్ కేటగిరీలో రూ.14,607 నుంచి రూ.19 వేలకు పెంచారు.

3 జోన్ 3 లో అన్ స్కిల్డ్ కేటగిరీలో కనీస వేతనం రూ.14 వేలు, సెమీ స్కిల్డ్ కు రూ.15 వేలు, స్కిల్డ్ కు రూ.16,500, హైలీ స్కిల్డ్ రూ.18 వేలకు పెంచారు.

# ముగిసిన ప్రధానిమోడీ విదేశీ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

దిగ్విజయంగా సాగింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, నెదర్లాండ్స్, స్వీడన్, నార్వే ఇటలీ దేశాల్లో పర్యటించారు. ఈ విదేశీ పర్యటనలో భాగంగా ఆయా దేశాల అధినేతలతో పలు కీలక అంశాలపై చర్చలు సాగించారు. శక్తి, రక్షణ, కీలక ఖనిజాలు సరఫరాలపై పలుఒప్పందాలు కుదుర్చుకున్నారు.

# ఆర్థిక వ్యవస్థలో ప్రధాని మోడీకి జ్ఞానం అవసరం

(మొదటి పేజీ తరువాయి)

గురువారం కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ప్రతినిధి జైరామ్ రమేష్ విమర్శించారు. భారత ప్రధాన ఎన్నికల కమిషన్ జ్ఞానేష్ కుమార్‌ను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారతదేశ ఆర్థిక విధాన రూపకల్పనలో సమూల మార్పు అవసరమని, కానీ మోడీ ప్రభుత్వానికి ఈ ఆలోచన రావడం లేదని అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థపై సెంటిమెంట్ ఎంతగా దిగజారిందంటే, మోడీ ప్రభుత్వానికి వృత్తిపరమైన మద్దతుదారులు కూడా తమ ఆందోళనలను బహిరంగంగా వ్యక్తం చేయడం ప్రారంభించారని అన్నారు. "ద్రవ్యోల్బణ అంచనాలు తీవ్రంగా పెరుగుతుండగా, వృద్ధి అంచనాలు గణనీయంగా తగ్గాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ద్రవ్యోల్బణ అంచనాలు తీవ్రంగా పెరుగుతుండగా, వృద్ధి అంచనాలు గణనీయంగా తగ్గాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు క్షీణిస్తూనే ఉన్నాయి. సరఫరా గొలుసులను (సప్లై చైన్‌లను) ఎంత దారుణంగా నిర్వహించారంటే, వినియోగదారులు తమ వినియోగాన్ని తగ్గించుకోవాలని ప్రధాని మోడీ ప్రజలకు ఇప్పుడు బహిరంగంగా సూచించారు " అని ఆయన అన్నారు. ఈ ఆందోళనలు కొత్తవి కావని.. గత కొంతకాలంగా కాంగ్రెస్ హెచ్చరిస్తూనే ఉందని అన్నారు. అత్యంత ముఖ్యమైనది మందకొడి పెట్టుబడి వాతావరణానికి సంబంధించినదని అన్నారు. ఇటలీ ప్రధాని మెలోనికి ప్రధాని మోడీ టోఫీలు బహుమతిగా ఇవ్వడాన్ని ప్రస్తావిస్తూ, మన ప్రధాని టోఫీలు పంచుతూ, ప్రజలకు విజ్ఞప్తులు చేయడంలో నిమగ్నమై ఉన్నారని విమర్శించారు. దేశం కాళ్ల కింద నేల జారిపోతోందని, ఆర్థిక విధాన రూపకల్పనలో మనకు సమూలమైన మార్పు అవసరమని, కానీ మోడీ ప్రభుత్వానికి యథావిధిగా ఆత్మస్తుతి చేసుకోవడం తప్ప వేరే ఆలోచనలు లేకుండా పోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి రేవంత్ రెడ్డి నివాళి

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం.. ఈ దేశంలో స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లకు నాంది పలికిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఆయన ఆశయ స్ఫూర్తితోనే పార్లమెంట్, అసెంబ్లీలలోనూ మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలన్నారు. భారతదేశానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, టెలికాం విప్లవాన్ని పరిచయం చేసి ప్రపంచ పటంలో దేశానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన గొప్ప దార్శనికుడు రాజీవ్ గాంధీ అని రేవంత్ కొనియాడారు. ఆయన ప్రవేశపెట్టిన ఆర్థిక సరళీకృత విధానాలే దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాయని గుర్తుచేశారు. తెలంగాణ ప్రాంతానికి, గాంధీ కుటుంబానికి మధ్య దశాబ్దాల కాలంగా ఒక అవినాభావ సంబంధం ఉందని, అది కేవలం రాజకీయ బంధం మాత్రమే కాదని.. కుటుంబ సంబంధాల కంటే ఎంతో పవిత్రమైనదని ఆయన వ్యాఖ్యానించారు. కోట్లాది మంది ప్రజల దశాబ్దాల ఆకాంక్షను గుర్తించి, సోనియా గాంధీ తీసుకున్న సాహసోపేతమైన చారిత్రాత్మక నిర్ణయంతోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర కల సాకారమైందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ గడ్డపై తెలంగాణ రాష్ట్రం ఉన్నంత కాలం ఇక్కడి ప్రజలు గాంధీ కుటుంబం చేసిన త్యాగాన్ని, సహాయాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటారని ఆయన పేర్కొన్నారు.

# రాష్ట్రంలో మోసపూరిత పాలన

(మొదటి పేజీ తరువాయి)

రెండేళ్ల పాలనలో ప్రజలకు చెప్పుకునే మంచి పని ఒక్కటీ చేయలేదని పేర్కొన్నారు. ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకే వైసిపిపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అమరావతి నిర్మాణం పేరుతో భారీ స్కాములు జరుగుతున్నాయని, అమరావతి కోసం ఇప్పటికే రూ.47,387 కోట్ల అప్పులు తెచ్చారని, రాష్ట్ర ఖజానా నుంచి మరో రూ.9,200 కోట్లు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. ప్రత్యామ్నాయంగా 'మావిగన్' ప్రాంతాన్ని రాజధాని కారిడార్‌గా ప్రతిపాదించామని జగన్ తెలిపారు. ఆ ప్రాంతంలో ఇప్పటికే మచిలీపట్నం పోర్టు, విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం, రైల్వే స్టేషన్లు, జాతీయ రహదారులు, మెడికల్ కాలేజీలు, విశ్వవిద్యాలయాలు ఉన్నాయని చెప్పారు. 35 నుంచి 40 లక్షల జనాభా ఉన్న ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం రాష్ట్రానికి ప్రయోజనకరమని చెప్పారు. కల్తీ మద్యం కేసులో అసలు నిందితులను వదిలి మాజీ మంత్రి జోగి రమేష్‌ను ఇరికించారని ఆరోపించారు. బిసి వర్గానికి చెందిన నేతను లక్ష్యంగా చేసుకుని రాజకీయ కక్ష సాధింపు చేస్తున్నారని అన్నారు. పొన్నూరు నియోజకవర్గంలోని మామిళ్లపల్లి ఘటనను ప్రస్తావిస్తూ రైతులపై అక్రమ కేసులు పెట్టారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన 'సూపర్ సిక్స్' సహా 143 హామీల అమలు ఎక్కడ జరిగిందని జగన్ ప్రశ్నించారు. పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గిస్తామని చెప్పి ఇప్పుడు పన్నులు పెంచారని విమర్శించారు. పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు రూ.4 చొప్పున అదనపు భారం మోపారని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేరుతో 16 కేటగిరీల బస్సుల్లో కేవలం 5 కేటగిరీల్లో మాత్రమే ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ఆర్టీసీని ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, 52 వేల మంది ఉద్యోగుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆరోపించారు. ఉద్యోగులకు 4 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, జిపిఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సహా దాదాపు రూ.35 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని పేర్కొన్నారు. పెన్షన్ల సంఖ్యను లక్షల్లో తగ్గించారని, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. 'బాబు అంటే మోసం -- జగన్ అంటే నమ్మకం' అని వ్యాఖ్యానించిన జగన్.. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం తమ రాజకీయ సంస్కృతి అని తెలిపారు. రాష్ట్రంలో ఎవరిది గొడ్డలి పార్టీ.. ఎవరిది గన్ కల్చర్?. ఎవరివి హత్యా రాజకీయాలని ప్రశ్నించారు. రాజారెడ్డి, వివేకానందరెడ్డిల హత్యలు చంద్రబాబు సిఎంగా ఉన్నప్పుడే జరిగాయన్నారు. వైఎస్ఆర్‌ను అసెంబ్లీకి ఎలా వస్తావో చూస్తానని బాబు అన్నారని, తర్వాత నాలుగు రోజులకే ప్రమాదంలో చనిపోయారని చెప్పారు. బాలకృష్ణ గన్‌తో ఇద్దరిని కాల్చిపడేయలేదా అని ప్రశ్నించారు. వంగవీటి మోహనరంగాఎలా చనిపోయారని ప్రశ్నించారు. పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని 'విజయవాడలో నిరాహారదీక్ష చేస్తుంటే, అర్ధరాత్రి నరికి చంపేశారు. ఈ ఘటనలో వేళ్లన్నీ చంద్రబాబు వైపే చూపిస్తాయి. ఈ కేసులో నిందితుడైన వెలగపూడి రామకృష్ణబాబును టిడిపి ఎమ్మెల్యేని చేశారు' అని అన్నారు. చంద్రబాబు నేర చరితను తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు అనేకసార్లు చెప్పారన్నారు. మహిళలను ఎక్కువమంది పిల్లల్ని కనమని సిఎం చెప్పడాన్ని తప్పుబట్టారు.

# ముస్లిం మైనార్టీలు
# ఐక్యతతో పోరాడాలి...!

- చట్టసభలలో ముస్లింలకు సముచితమైన స్థానం కల్పించాలి
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మౌలానా నవాజ్ బియాబానీ చిష్తిఉల్ ఖాద్రీ





**అనంతపురం - సూర్య వాస్తవం :** అనంతపురం పట్టణంలోని స్థానిక పారడైస్ ఫంక్షన్ హాల్ లో యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సమాజంలో ప్రతి ఒక్కరికీ ఓటుపై అవగాహన కల్పించేందుకు,ఓటర్ లిస్ట్‌లో తప్పుల సవరణ మరియు వెరిఫికేషన్ (సర్ )ప్రక్రియపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశం లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మౌలానా నవాజ్ బియాబానీ చిష్తిఉల్ ఖాద్రీ మాట్లాడుతూ.....కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ (సార్ )ప్రక్రియలో మైనారిటీల ఓట్ల తొలగింపుపై తీవ్ర రాజకీయ చర్చ జరుగుతోంది. అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించి, మైనారిటీల ఓటు బ్యాంకును దెబ్బతీసేందుకు ఈ కార్యక్రమం ఒక ముసుగులా ఉపయోగపడుతోందని తెలిపారు.ఈ భారీ తొలగింపుల వెనుక రాజకీయ కుట్ర ఉందని, ఇందులో మైనారిటీ ఓటర్లు అధికంగా నష్టపోయారని అయన అన్నారు.ముస్లిం మైనార్టీలు విద్యా, ఆర్థిక, మరియు రాజకీయ రంగాలలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకోవడానికి ఐక్యతతో పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కలిసికట్టుగా నిలవడం ద్వారానే వారి హక్కులను సాధించుకోవడం సాధ్యమవుతుందని ఆయన పిలుపు నిచ్చారు. చట్టసభలలో ముస్లింలకు సముచితమైన స్థానం లభించేలా, పార్టీలకు అతీతంగా సరైన నాయకులను ఎన్నుకోవాలన్నారు. రాజ్యాంగం కల్పించిన మైనారిటీ హక్కుల పరిరక్షణ కోసం చట్టబద్ధమైన పోరాటాలు చేయాలన్నారు.

# నీట్ పేపర్ లీకేజీ.. రాజస్థాన్‌లో కాంగ్రెస్ ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. రాజస్థాన్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గోవింద్ సింగ్ డోటస్రా నేతృత్వంలో కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయం నుంచి బీజేపీ ప్రధాన కార్యాలయం వైపు నిరసన ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనలో ప్రతిపక్ష నాయకుడు టికారామ్ జుల్లీతో పాటు పలువురు సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొన్నారు. నిరసన ఉధృతం కావడంతో, బీజేపీ కార్యాలయం సమీపంలో ఆందోళనకారులను చెదరగొట్టడానికి పోలీసులు వాటర్ కెనాన్లను ఉపయోగించారు. బీజేపీ నాయకుల ప్రమేయం ఉందని. వీరు పేపర్ లీక్ మాఫియాపై ఎటువంటి చర్యలూ తీసుకోకుండా, వారిని రక్షించడానికి ప్రయత్నిస్తున్నారని, ఈ పేపర్ లీకేజీపై పీఎం మోడీ మౌనం వహించమేంటని కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు.

# సెప్టెంబర్ కల్లా పనులు
## - ఎంఓయులపై సీఎం ఆదేశం

**అమరావతి - సూర్య వాస్తవం :**

ఆమోదం పొందిన ప్రాజెక్టు పనులు ఈ ఏడాది సెప్టెంబర్ కల్లా ప్రారంభం కావాలని, ఆయా ప్రాజెక్టులు డిసెంబర్ 2028 కల్లా ప్రారంభమయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. రాష్ట్రం అనుసరిస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని ఆచరణలో చూపాలన్నారు. విశాఖ భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాలు, ఎస్ఐపిబి ఆమోదించిన ప్రాజెక్టులపై మంత్రుల కమిటీతో గురువారం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాజెక్టులకు అనుమతులు, ఉద్యోగాల కల్పనకు కోసం సింగిల్ పోర్టల్‌లో డ్యాష్ బోర్డు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భూ కేటాయింపుల్లో మొదటగా పర్యాటక ప్రాజెక్టులకు, తర్వాత ఐటి కంపెనీలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సూర్యలంక బీచ్ ఫ్రంట్ ను మరో గోవాగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు చేయాలని, బాపట్ల బీచ్‌కు త్వరలో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 21 ప్రధాన ఆలయాలను కలుపుతూ టెంపుల్ టూరిజం ప్రాజెక్టు వేగంగా చేపట్టాలన్నారు. ?నౌకా నిర్మాణంలో విస్తృత అవకాశాలు షిప్ బిల్డింగ్ సెంటర్ నిర్మాణం, పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సిఎం అన్నారు. నౌకా నిర్మాణ రంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని స్పష్టం చేశారు. ?ట్రాన్స్‌మిషన్‌తో పాటు సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని, రాష్ట్రం నిర్దేశించుకున్న 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యాన్ని వేగంగా చేరుకోవాలని సూచించారు. ఇప్పటికే 99 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ విద్యుత్ ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు తెలిపారు. సర్క్యులర్ ఎకానమీని ప్రోత్సహించేలా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు త్వరితగతిన ఏర్పాటయ్యేలా చూడాలని అన్నారు. 2027 డిసెంబరు నాటికి 46 ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులు ఉత్తత్తి ప్రారంభించేలా నిరంతరం పారిశ్రామికవేత్తలతో సంప్రదింపులు చేయాలని సీఎం సూచించారు. వైద్యారోగ్య రంగ ప్రాజెక్టులు రాష్ట్రంలో ఏర్పాటు కావాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో చేపట్టే ప్రాజెక్టుల్లో పర్యావరణ హిత టెక్నాలజీ వినియోగించాలని చంద్రబాబు సూచించారు. తీరప్రాంతాల్లో సముద్రంలోకి కాలుష్య కారకాలను విడిచిపెట్టకుండా చూడాలని అన్నారు. ఇప్పటి వరకు కుదుర్చుకున్న ఎంఓయూలు, ప్రాజెక్టుల పురోగతిపై ఐటి శాఖా మంత్రి నారా లోకేష్ ఈ సందర్భంగా ప్రజెంటేషన్ ఇచ్చారు.

# అయ్యా లోకేష్ బాబు..
# మాకు న్యాయం చేయండి!

## అనంతపురం డి సి హెచ్ ఎస్ ఆఫీసులో రోస్టర్ 'కుర్చీలాట'పై నిరుద్యోగుల గర్జన




**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయకర్త (డి సి హెచ్ ఎస్ )కార్యాలయం ఇప్పుడు అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందా? అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మరియు వారి 'కోర్ టీమ్' ఆడిందే ఆట.. పాడిందే పాటగా సాగుతోందా? అంటే బాధితుల నుంచి వస్తున్న సమాధానం 'అవును'. నిబంధనలను తుంగలో తొక్కి, తమకు కావాల్సిన వారికి పట్టం కట్టేలా రోస్టర్ పాయింట్లను మార్చేశారనే ఆరోపణలు ఇప్పుడు జిల్లాలో కలకలం రేపుతున్నాయి.

**ఏఓ అండ్ కో.. రోస్టర్ మాయాజాలం !**

సాధారణంగా ప్రభుత్వం ఇచ్చే 100 పాయింట్ రోస్టర్ సైకిల్ అనేది ఒక క్రమ పద్ధతిలో సాగాలి. కానీ, ఇక్కడి ఏ ఓ మరియు సదరు 'కో టీమ్' మాత్రం మేధావులను మించిన తెలివితేటలు ప్రదర్శిస్తున్నారట. తమకు అనుకూలమైన అభ్యర్థులకు ఏ పాయింట్ దగ్గర ఉద్యోగం వస్తుందో చూసుకుని, ఆ మేరకు సైకిల్‌ను అటు ఇటు తిప్పేశారని అభ్యర్థులు మండిపడుతున్నారు. ఎంక్వైరీ లేని 'సామ్రాజ్యం': ఇంత రచ్చ జరుగుతున్నా, అభ్యర్థులు ఆధారాలతో సహా మొత్తుకుంటున్నా.. ఇప్పటి వరకు సదరు ఏ ఓ టీమ్ పైన ఒక్కటంటే ఒక్క ఎంక్వైరీ కూడా వేయకపోవడం మరియు వారు చేసిన పని కరెక్ట్ అని వివరణ అడగక పోవడం గమనార్హం.

**డిసిహెచ్ఎస్ ఆశీస్సులు...?**

అధికారులు ఇంత ధైర్యంగా అక్రమాలకు పాల్పడుతున్నారంటే, వారి వెనుక డి సి హెచ్ ఎస్ 'అభయహస్తం' గట్టిగానే ఉందనే ఆవేదన నిరుద్యోగుల్లో వ్యక్తమవుతోంది.

నిజాయితీగా చదివిన వాడికి 'నోటీసు'.. తమ వాళ్లకు 'నోటిఫికేషన్' అన్నట్టుగా ఉంది ఇక్కడి తీరు.

జీ ఏ డి నుంచి క్లారిటీ రాకముందే, పాత తప్పులను సరిదిద్ద కుండానే.. మళ్లీ అదే టీమ్‌తో రిక్రూట్‌మెంట్ అంటే, అది 'నియామక ప్రక్రియ' నా లేక 'నిశ్చితార్థపు వేడుక' నా అని జనం నవ్వుకుంటున్నారు. త్వరలో మరి కొన్ని ఆధారాలతో మరో కథనం సూర్య వాస్తవం పాఠకులకు తీసుకోని వస్తుంది

**నేరుగా లోకేష్ బాబుకే ఫిర్యాదులు !**

స్థానిక అధికారులు 'అంతా మా ఇష్టం' అన్నట్టుగా వ్యవహరిస్తుండటంతో, విసిగిపోయిన అభ్యర్థులు తమ పోరాటాన్ని అమరావతికి తరలించారు. "అయ్యా లోకేష్ బాబు.. మాకు న్యాయం చేయండి!" అంటూ తమ గోడును వివరిస్తూ నేరుగా మంత్రి గారికి పోస్ట్ ద్వారా వినతి పత్రాలు పంపారు. "రాష్ట్రంలో పారదర్శక పాలన తెస్తామని హామీ ఇచ్చిన లోకేష్ బాబు గారు, మా జిల్లాలోని ఈ 'నియామక సిండికేట్' పై ఉక్కుపాదం మోపాలి. ఏ ఓ ఆ కోర్ టీమ్ చేస్తున్న అక్రమాలపై తక్షణమే విచారణ జరిపించాలి."

--- బాధిత నిరుద్యోగులు.

# వాహనదారుల రక్షణ, భద్రత ధ్యేయం...

- జిల్లా ఎస్పీ పి.జగదీష్
- జూన్ నెలలో జిల్లా వ్యాప్తంగా డ్రైవింగ్ లైసెన్స్, వెహికల్ ఇన్సూరెన్స్ ప్రత్యేక అవగాహన సదస్సులు
- జిల్లాలోని అన్ని సబ్ డివిజన్లలో ప్రత్యేక డ్రైవ్
- అక్కడికక్కడే లైసెన్సులు, బీమా నమోదు



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లాలోని వాహనదారుల రక్షణ, భద్రత ధ్యేయంగా రాబోయే జూన్ నెలలో డ్రైవింగ్ లైసెన్స్ మరియు వెహికల్ ఇన్సూరెన్స్‌లపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అనంతపురం లిజిల్లా ఎస్పీ పి.జగదీష్, తెలియ జేశారు. ఈరోజు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాల యంలో పోలీస్, ఆర్టీఏ అధికారులు మరియు వివిధ ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులతో ఎస్పీ సమీక్షా సమావేశం నిర్వహించారు.?ఈ సమావేశంలో పోలీస్, రవాణా మరియు బీమా సంస్థలు సమిష్టిగా పనిచేస్తూ... ప్రజల్లో చైతన్యం తేవడంతో పాటు, నేరుగా డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేయించడం, గడువు ముగిసిన వాహనాలకు ఇన్సూరెన్స్ కట్టించడం లాంటి వినూత్న కార్యక్రమానికి ప్రణాళికలు సిద్ధం చేశారు.ఈ ప్రత్యేక డ్రైవ్‌ను జిల్లాలోని అన్ని సబ్ డివిజన్లలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారు.

ఒక్కో రోజు.. ఒక్కో సబ్ డివిజన్: ముందస్తు ప్రణాళిక ప్రకారం, ఒక్కో రోజు ఒక్కో సబ్ డివిజన్ పరిధిలో ఈ అవగాహన సదస్సులు జరుగుతాయని ?డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి, అలాగే ఇన్సూరెన్స్ టైమ్ అయిపోయిన వారికి అక్కడికక్కడే అవగాహన కల్పించి, నిబంధనల ప్రకారం వాటిని పొందేలా అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. చాలామంది వాహనదారులు నిర్లక్ష్యంతోనో లేదా అవగాహన లేకనో లైసెన్స్ లేకుండా, ఇన్సూరెన్స్ రీన్యూ చేయకుండా వాహనాలు నడుపుతున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఇది వారి కుటుంబాలను కోలుకోలేని దెబ్బ తీస్తుంది. అందుకే జూన్ నెలలో ప్రతి సబ్ డివిజన్ పరిధిలో ప్రజలను చైతన్య పరిచి, ఈ సేవలను వారి వద్దకే తీసుకువెళ్తున్నామని జిల్లా ఎస్పీ పి జగదీష్ తెలిపారు.?ఈ సమావేశంలో అనంతపురం ఆర్టీఓ సురేష్ నాయుడు, వివిధ బీమా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. సబ్ డివిజన్ల వారీగా నిర్వహించే తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని, జిల్లా ప్రజలు, వాహనదారులు ఈ అవకాశాన్ని పెద్ద ఎత్తున సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు.

# 28న బక్రీద్

**అమరావతి - సూర్య వాస్తవం :** రాష్ట్రప్రభుత్వం ఈ నెల 28వ తేదిన బక్రీద్‌ను ప్రకటించింది. ఇందుకు సంబంధించిన జివో 1006ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్ గురువారం విడుదల చేశారు. గతంలో బక్రీద్ ను ప్రభుత్వం ఈ నెల 27వ తేదిన సెలవు దినంగా ప్రకటించింది. నెలవంక ఆధారంగా ముస్లిం సమాజం బక్రీద్ వేడుకను ఈనెల 27కు బదులుగా 28 గురువారం నిర్వహించుకోనునన్నారని విజయవాడ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ముఖ్య కార్య నిర్వహణాధికారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీంతో ఈనెల 27వ తేది సెలవును 28వ తేదీకి మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది.



# ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

**అమరావతి - సూర్య వాస్తవం :** ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉదయం జరిగిన పరీక్షకు మొదటి సంవత్సరం విద్యార్థులు 93.40శాతం హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 80,728 మంది పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, వారిలో 75,400 మంది పరీక్ష రాశారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 40,703 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 36,350 (89.75శాతం) మంది హాజరయ్యారు. ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి పి రంజిత్ బాషా విజయవాడ పరిధిలోని శస్త్ర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ప్రకాశం జిల్లాకు చెందిన విద్యార్థి అక్రమాలకు పాల్పడుతూ పట్టుబడటంతో నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఇంటర్మీడియట్ బోర్డు గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది.

# ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లి వేగవంతమైన సేవలు అందిస్తా

## - ప్రజల కోసం ప్రతి క్షణం...

## సమస్యల పరిష్కారమే లక్ష్యం : బీటెక్ రవి



**పులివెందుల– సూర్య వాస్తవం:** సీఎం చంద్రబాబు సమర్థ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా, పారదర్శక పాలన అందిస్తూ ముందుకు సాగుతోంది. గురువారం పులివెందుల టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా దర్బార్' కార్యక్రమంలో పాల్గొని, నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు, వినతులను స్వయంగా స్వీకరించి పరిశీలించాను. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను శ్రద్ధగా విని, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించడం జరిగింది. ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లి, వేగవంతమైన సేవలు అందించడం మన ప్రభుత్వ ప్రధాన ధ్యేయం. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూనే ఉంటాం. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ



**గార్లదిన్నె– సూర్య వాస్తవం:** గార్లదిన్నె మండలం పెనకచెర్ల ఫారెస్ట్ ఏరియాలో జలహారతి, జల ధార పథకం కింద జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అక్కడ పనిచేస్తున్న ఉపాధి హామీ శ్రామికులతో మాట్లాడి, పనుల పురోగతి, శ్రామికులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ శ్రామికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే శ్రామికులకు మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అక్కడ ఉన్న ఏపీవోకు ఆదేశాలు జారీ చేశారు. ఏదైనా మెడికల్ ఎమ ర్జెన్సీ పరిస్థితి తలెత్తక ముందే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ శ్రామికుల వద్దకు ఏఎన్ఎంలు ఫీల్డ్ విజిట్ నిర్వహించి, ఎండల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి, అవసరమైన మందులు అందించాలని, శ్రామికుల ఆరోగ్యం, సంక్షేమం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

# హ్యాండ్స్' సంస్థ ఆధ్వర్యంలో ముమ్మరంగా వ్యవసాయ సర్వే



**కూడేరు – సూర్య వాస్తవం :** రైతుల అవసరాలను గుర్తించి, వారికి ప్రణాళికా బద్ధంగా సేవలు అందించడమే లక్ష్యంగా 'హ్యాండ్స్' స్వచ్ఛంద సంస్థ కూడేరు మండలంలో సంస్థ హెడ్ ఆఫీస్ టీమ్ మండల పరిధిలోని పలు గ్రామాలను సందర్శించి, వ్యవసాయ సర్వే కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించింది. హ్యాండ్స్ టీమ్ ప్రతినిధులు రవి,రాజు డీఎన్ సంయుక్తంగా ఈ సర్వే ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు.

సర్వేలో భాగంగా ప్రతినిధుల బృందం గ్రామాల వారీగా రైతులతో మమేకమై సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రైతుల సాగు భూమి విస్తీర్ణం, వారికి అవసరమైన మొక్కల రకాలు, మరియు కావలసిన మొక్కల సంఖ్య వంటి కీలక వివరాలను సేకరిస్తున్నారు. ఈ కార్యక్రమంపై స్థానిక రైతాంగం ఎంతో ఆసక్తిని కనబరుస్తూ, తమ సాగు వివరాలను ఉత్సాహంగా నమోదు చేయిస్తున్నారు. ప్రస్తుతానికి కూడేరు మండలంలో సుమారు 200 ఎకరాలకు సంబంధించిన రైతుల వివరాలను విజయవంతంగా నమోదు చేసినట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. ఇంకా పలువురు రైతులు ఈ కార్యక్రమంపై ఆసక్తి చూపుతుండటంతో, వారందరికీ కూడా అవసరమైన మొక్కలను, తగిన సహాయ సహకారాలను అందిస్తామని టీమ్ సభ్యులు భరోసా ఇచ్చారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ సర్వే ముఖ్య ఉద్దేశ్యం రైతుల నిజమైన అవసరాలను గుర్తించి, వారికి సరైన సమయంలో నాణ్యమైన సేవలు అందించడమేనని హ్యాండ్స్ టీమ్ స్పష్టం చేసింది. మండలంలో ఇంకా సర్వేలో పాల్గొనని రైతులు లేదా మొక్కలు కావలసిన వారు వెంటనే సంబంధిత 'హ్యాండ్స్' సంస్థ ప్రతినిధులను సంప్రదించి తమ వివరాలను నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు.

# సౌత్ కెనాల్ కోసం సీఎం నిధులు విడుదల చేయడం హర్షణీయం: జేసి



**తాడిపత్రి – సూర్య వాస్తవం :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తాడిపత్రి సౌత్ కెనాల్ పనుల కోసం రూ. 7 కోట్లకు పైగా నిధులు విడుదల చేయడం పట్ల మాజీ మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పుట్లూరు, ఎల్లనూరు మండలాలకు సాగు, తాగు నీరు అందడం ఎంతో కష్టంగా ఉండేదని ఇప్పుడు సీఎం ప్రత్యేక చొరవతో నిధులు విడుదల కావడంతో ఆ సమస్య తీరబోతుందని పేర్కొన్నారు. నిధులు విడుదలైన నేపథ్యంలో కాలువ పనుల నాణ్యత విషయంలో రాజీ పడేదే లేదని స్పష్టం చేశారు. పనులు గనుక నాసిరకంగా జరిగితే సహించేది లేదని అధికారులను, కాంట్రాక్టర్లను ఆయన హెచ్చరించారు. ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయం స్థానిక రైతులకు, ప్రజలకు ఎంతో మేలు చేకూరుస్తుందని జేసీ ప్రభాకర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. సౌత్ కెనాల్ ఆధునీకరణ మరియు పునరుద్ధరణ పనుల కోసం నిధులు విడుదల కావడం వల్ల స్థానిక రైతులకు, ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఈ ప్రాజెక్ట్ వల్ల రైతులకు కలిగే ప్రధాన ఉపయోగాలు పుట్లూరు, ఎల్లనూరు మండలాలకు శాశ్వత నీటి పరిష్కారం గతంలో తాడిపత్రి నియోజకవర్గంలోని పుట్లూరు, ఎల్లనూరు మండలాల్లోని చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందడం చాలా కష్టంగా ఉండేది. ఈ నిధుల ద్వారా కాలువ పనులను పూర్తి చేయడం వల్ల, ఎగువ ప్రాంతాల నుండి కింది వరకు నీరు ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రవహిస్తుంది. దీనివల్ల ఈ రెండు మండలాల్లోని వేలాది ఎకరాల పొలాలకు సకాలంలో నీరందుతుంది.

### సాగునీటి కొరత తీరడం

సౌత్ కెనాల్ చాలా కాలంగా పూడిక పేరుకుపోవడం, గండ్లు పడటం వల్ల నీరు వృథాగా పోయేది. ఇప్పుడు రూ. 7 కోట్లకు పైగా నిధులతో కాలువను బాగు చేయడం వలన నీటి ప్రవాహ వేగం పెరుగుతుంది. నీటి వృథా తగ్గుతుంది. కాలువ చివరన ఉన్న రైతులకు కూడా వారి కోటా ప్రకారం పూర్తి స్థాయిలో సాగునీరు అందుతుంది.

### భూగర్భ జలాలు పెరగడం

కాలువలో నిరంతరం నీటి సరఫరా ఉండటం వల్ల చుట్టుపక్కల ప్రాంతాల్లోని భూగర్భ జలమట్టం గణనీయంగా పెరుగుతుంది. దీనివల్ల కాలువ కింద నేరుగా భూమి లేని రైతులు కూడా తమ బోరు బావుల ద్వారా పంటలకు నీరు పారించుకునే అవకాశం దక్కుతుంది. ఈ పనుల వల్ల కేవలం సాగునీరే కాకుండా, కాలువ పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల్లో ఉన్న చెరువులను నింపడా నికి వీలవుతుంది.

ఇది అటు పశువులకు, ఇటు ప్రజలకు తాగునీటి కొరత రాకుండా చూస్తుంది. మాజీ మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నట్లు, ఈ పనులు నాణ్యతతో జరిగితేనే రైతులకు సుదీర్ఘ కాలం పాటు ఈ ప్రయోజనాలు అందుతాయి. నాసిరకం పనులు జరగకుండా స్థానిక రైతులు, నాయకులు పర్యవేక్షించడం ఈ ప్రాజెక్టు విజయానికి ఎంతో కీలకం.

# అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల దాడి

## - నాలుగు ట్రాక్టర్లు స్వాధీనం



**పెద్దవడుగూరు – సూర్య వాస్తవం :** పెద్దవడుగూరు మండలంలోని చిట్టూరు గ్రామంలో పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. స్థానిక ఎస్ఐ ఆంజనేయులు తన సిబ్బందితో కలిసి గురువారం నది పరివాహక ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు రంగంలోకి దిగి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఆంజనేయులు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా సహజ వనరులను అక్రమంగా తరలిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన నిందితులపై ఇప్పటికే కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై స్పష్టం చేశారు. మండలంలో ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

# రైతు కంట కన్నీరు

## - ఉరుములు మెరుపులతో కూడిన వర్షానికి రెండు ఎద్దులు మృతి



**శింగనమల– సూర్య వాస్తవం :** సింగనమల మండల పరిధిలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కారణంగా ఏకుల నాగేపల్లి గ్రామానికి చెందిన ప్రేమ నాథ రెడ్డి, వసంత కుమార్ రెడ్డి రైతులకు చెందిన వ్యవసాయ పనులకు ఉపయోగించే ఎద్దులు ఆకస్మికంగా మరణించిన ఘటనపై సమాచారం అందిన పిదప పశుసంవర్ధక శాఖ అధికారులు స్పందించారు. సింగన మల మండల పశు సంవర్ధక శాఖ అధికారి డా. మౌన ప్రియ సెలవులో ఉన్నందున, ఇన్‌ఛార్జ్ డాక్టర్ ఎస్. రమేష్, వెటర్నరీ డాక్టర్, గార్లదిన్నె వారు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మృత జంతువులకు పోస్టుమార్టం నిర్వహించారు. ప్రాథమిక పరిశీలన ప్రకారం ఉరుములు/మెరుపులు లేదా ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల మరణం సంభవించినట్లు అనుమానించ బడింది. పోస్టుమార్టం నివేదిక సిద్ధం చేసి తదుపరి చర్యల కొరకు నివేదిక సమర్పించారు. సంబంధిత వివరాలతో కూడిన నివేదికను సింగనమల ఎమ్మార్వో ద్వారా జిల్లా కలెక్టర్‌కి సమర్పించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం మంజూరు చేయుటకు వినతి పత్రం అందించారు. మరణించిన ఎద్దులు వ్యవసాయ పనులకు ఉపయోగించబడుతున్నందున రైతుల జీవనాధారంపై తీవ్ర ప్రభావం పడింది. **నష్ట వివరాలు:** మరణించిన ఎద్దుల సంఖ్య: 2, ఒక్క ఎద్దు అంచనా విలువ: రూ. 80,000, మొత్తం అంచనా నష్టం: రూ. 1,60,000. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సంబంధిత రైతులకు నష్టపరిహారం మంజూరు చేయుటకు అవసరమైన చర్యలు తీసుకోవలసిందిగా సింగనమల పశు సంవర్ధక శాఖ సంచాలకులు నివేదికను జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారికి, సమర్పించారు.

# శిరిడి సాయిబాబాకి విశేష పూజలు

## - ప్రత్యేక అలంకరణలో సాయినాధుడు



**పులివెందుల అర్బన్ – సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణంలోని పార్నపల్లి రోడ్డు సమీపంలో మొట్టమొదటిగా కొలువైన శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం షిరిడి సాయిబాబా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయా స్తమాన స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు మురళి స్వామి ఆధ్వర్యంలో సాయినాధునికి ఉదయం కాగడ హారతి, పంచామృతా భిషేకం, సహస్ర నామార్చన, అష్టోత్తర శతనామావళి, తదితర పూజా కార్యక్రమాల అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకా రంలో భక్తులకు దర్శనమిచ్చారు . మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్నం హారతి సాయంకాలం 6 గంటలకు సంధ్య హారతి రాత్రి 9 గంటలకు శేజ హారతులు స్వామివారికి అర్పించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య మాట్లాడుతూ ప్రతి గురువారం ఆలయంలో భక్తుల సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమాలు విశేషంగా నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా ప్రతి గురువారం పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకోవడం జరుగుతోందని తెలియజేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నిదనవాడ మనోహర్ రెడ్డి

## - నివాళులు అర్పించిన శింగనమల మండల తెలుగుదేశం నాయకులు



**శింగనమల– సూర్య వాస్తవం:** శింగనమల మండలం నిదనవాడ గ్రామానికి చెందిన మనోహర్ రెడ్డి అనంతపురంలోని తపోవనం దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించగా విషయం తెలుసుకున్న తెలుగుదేశం నాయకులు శిశీగనమల మండల పార్టీ కన్వీనర్ గోరంట్ల మారుతి నాయుడు, సీనియర్ తెలుగుదేశం నాయకులు ఈశ్వర్ రెడ్డి, సింగల్ విండో చైర్మన్ గుర్రం లక్ష్మీనారాయణ, నిదనవాడ సుధీర్ రెడ్డి, విశ్వనాథరెడ్డి రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, తదితరులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో మరణించిన మనోహర్ రెడ్డి కుటుంబాన్ని తెలుగుదేశం పార్టీ అన్ని విధాల ఆదుకుంటుందని మీ కుటుంబం ధైర్యంగా ఉండాలని మృతిని కుటుంబానికి తెలుగుదేశం పార్టీ నాయకులు భరోసా ఇచ్చారు.

# బండ లాగుడు పోటీని ప్రారంభించిన ఎస్ఐ ఆంజనేయులు



**పెద్దవడుగూరు– సూర్య వాస్తవం :** పెద్దవడుగూరు మండలం అవులం పల్లి గ్రామంలో గురువారం బండలాగుడు పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఎస్సై ఆంజనేయులు చేతుల మీదుగా ఈ పోటీలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. పోటీలను ఎలాంటి గొడవలు లేకుండా, ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలని ఎస్సై నిర్వాహకులకు సూచించారు. ఈ ఉత్సాహభరితమైన పోటీలు మరో రెండు రోజుల పాటు కొనసాగనున్నాయి. ఈ సాంప్రదాయక క్రీడను చూడటానికి చుట్టుపక్కల వివిధ ప్రాంతాల నుండి ప్రజలు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి సాంప్రదాయక బండలాగుడు/దూలం లాగుడు పోటీలు ప్రజలకు మంచి వినోదాన్ని, ఉత్సాహాన్ని ఇస్తాయి.

# 24న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్షలు

**- 2026 నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి**
**- అనంతపురం జిల్లా కలెక్టర్ ఆనంద్**



**అనంతపురం – సూర్య వాస్తవం :** కేంద్ర ప్రభుత్వ సర్వీసుల భర్తీ కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్) పరీక్షలు–2026 అనంతపురము జిల్లాలో సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, కోఆర్డినేటింగ్ సూపర్వైజర్ ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ యుపిఎస్సీ ప్రిలిమ్స్ పరీక్షల నిర్వహణ సన్నద్ధతపై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల 24వ తేదీ ఆదివారం జిల్లా కేంద్రంలోని 7 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 2,515 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షలు రెండు సెషన్లలో జరుగుతాయని, ఉదయం 09:30 నుండి 11:30 వరకు పేపర్–1, మధ్యాహ్నం 02:30 నుండి 04:30 వరకు పేపర్–2 నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వారీగా అభ్యర్థుల వివరాలను వెల్లడిస్తూ.. వెన్యూ కోడ్: 76005 జీసస్ నగర్ లోని ఎస్.వి. డిగ్రీ డ పిజి కళాశాలలో 480 మంది, వెన్యూ కోడ్ 76001 జె.ఎన్.టి.యు.ఏ ఇంజనీరింగ్ కళాశాల సెంటర్–ాూ లో 384 మంది, వెన్యూ కోడ్ 76002 జె.ఎన్.టి.యు.ఏ ఇంజనీరింగ్ కళాశాల సెంటర్–దీ లో 384 మంది, వెన్యూ కోడ్ 76003 భైరవ నగర్ లోని కె.ఎస్.ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 480 మంది, వెన్యూ కోడ్ 76006 క్లాక్ టవర్ సమీపంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో 469 మంది, వెన్యూ కోడ్ 76007 శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో 306 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారని వివరించారు. అలాగే వెన్యూ కోడ్ 76004 ఎస్.ఎస్.బి.ఎన్ డిగ్రీ కళాశాలలో 12 మంది దివ్యాంగ (ఎజ / ాణజూ) అభ్యర్థుల కోసం ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, అభ్యర్థులకు అవసరమైన కనీస సౌకర్యాలైన తాగునీరు, వెలుతురు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని, మెడికల్ క్యాంప్, అంబులెన్స్ ఏర్పాటు, ఆర్టీసీ బస్సులు సరిపడా నడపాలని, ప్రధాన పోస్టల్ శాఖ ఉదయం నుండి మొత్తం పరీక్ష ఐపోయాక పరీక్ష రాసిన పేపర్లను పంపేలా ఉండాలని, పరీక్ష కేంద్రాల వద్ద నిబంధనల మేరకు ఇంటర్నెట్ జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని డీసీఎల్ చర్యలు తీసుకోవాలని, జామర్స్ ఏర్పాటు, పరీక్షలకు వచ్చే అభ్యర్థులకు మెటల్ డిటెక్టర్ ఫ్రిస్కింగ్ సక్రమంగా చేపట్టాలని, హాజరయ్యే అభ్యర్థులకు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ ఏర్పాటు ఉండాలని, సీటింగ్ ప్రణాళిక పక్కాగ ఉండాలని, సెల్ ఫోన్ కలెక్షన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వెన్యూ సూపర్వైజర్లను కలెక్టర్ ఆదేశించారు. లోకల్ ఇన్స్పెక్టింగ్ అధికారులు, రూట్ అధికారులు వారి బాధ్యతలు జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. పరీక్ష కేంద్రాన్ని పరీక్ష ప్రారంభానికి ఒకటిన్నర గంట ముందే తెరిచి ఉంచాలని, పరీక్ష ప్రారంభానికి 30 నిమిషాల ముందు వరకు మాత్రమే పరీక్ష రాసేకి వచ్చే అభ్యర్థులకు అనుమతి ఉంటుందని, ఆ తర్వాత అనుమతి ఉండదని పేర్కొన్నారు. ఎలాంటి ఎలెక్ట్రానిక్ గాడ్జెట్లు పరీక్ష కేంద్రంలోనికి అనుమతి లేదని స్పష్టం చేశారు. అలాగే జిల్లా కలెక్టరేట్ నందు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని డిఆర్ఓ ను ఆదేశించారు. పరీక్షల పారదర్శకతను కాపాడటంలో అధికారులు నిబద్ధతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. వెన్యూ సూపర్వైజర్లు వెంటనే తమ సంబంధిత పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రతినిధి ప్రవీంద్ర పు ఎస్పీ వివిధ పరీక్షా కేంద్రాల సూపర్వైజర్లు, సంబంధిత ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# రైతన్నల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు

**- రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి**






**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి,సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ రైతుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తూ రైతుల పక్షపాతిగా నిలుస్తున్నాడని రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.గురువారం రాయచోటి మండల పరిధిలోని కాటిమాయకుంట గ్రామంలో ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఒక నెల, ఒక గ్రామం,నాలుగు సందర్శనలు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు తనకున్న అపార అనుభవంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రాజెక్టుల నిర్మాణాలను పరుగులు తీయిస్తూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు నడుస్తున్నాడని కొనియాడారు.గత వైసిపి ప్రభుత్వంలో గ్రామీణ వ్యవస్థ చిన్నాభిన్నంగా మారిందని,ఆ వ్యవస్థను సరి చేయడంతో పాటు రెవెన్యూ పరంగా,భూ సమస్యల పరంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించే కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక నెల ఒక గ్రామం నాలుగు సందర్శనలు అనే వినూత్న కార్యక్రమాన్ని తీసుకువచ్చి ఆయా గ్రామపంచాయతీల లోనే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తూ పారదర్శకమైన పాలనను అందిస్తున్నారన్నారు.ఈ వినూత్న కార్యక్రమం ద్వారా ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరిగే అవసరం లేకుండా గ్రామంలోనే సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటున్నారని తెలిపారు.రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కృషితో రాయచోటి నియోజకవర్గంలో ప్రజల సమస్యలు ఎప్పటికప్పటికీ పరిష్కారం అవుతున్నాయ న్నారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ వినూత్న కార్యక్రమాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు రైతులు సద్వినియోగం చేసుకొని, సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం తహసిల్దార్ నరసింకుమార్ మాట్లాడుతూ గ్రామాలలో నిలకలు ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే లక్ష్యంతో మీ సమస్య మా బాధ్యత అనే కార్యక్రమం ద్వారా ప్రభుత్వం తీసుకొచ్చిన ఒక నెల,ఒక గ్రామం,నాలుగు సందర్శనల ద్వారా రైతులు ప్రజలు తమ భూ సమస్యలను రెవెన్యూ పరంగా ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జిల్లానీ భాష,గ్రామ నాయకులు గుడి రఘునాథ,వెంకటచలమారెడ్డి,పుల్లగూర రామాంజలు తదితరులు పాల్గొన్నారు.

# పీలేరు అయ్యప్పనేని చెరువుకు సరికొత్త రూపు రావాలి

**- సుందరీకరణతో ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం**
**- పింఛా నది నుంచి నీటి సరఫరాకు ప్రత్యేక ప్రణాళిక**
**- అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డితో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**





**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం :** పీలేరు మండలంలోని అయ్యప్పనేని చెరువును గురువారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పరిశీలించారు. చెరువును సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన పర్యాటక, వినోద కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్, ఎమ్మెల్యే విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా చెరువులో పేరుకుపోయిన పూడికను తొలగించి, చెరువు చుట్టూ సుందరీకరణ పనులు చేపట్టాలని సూచించారు. ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో విశ్రాంతిగా గడిపేలా చెరువు కట్టపై పచ్చదనం పెంపు, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్ దీపాల ఏర్పాటు, కూర్చునే సౌకర్యాలు కల్పించే అంశాలను ప్రతిపాదనల్లో పొందుపరచాలని ఆదేశించారు. అలాగే పింఛా నది నుంచి అయ్యప్పనేని చెరువుకు నీరు చేరేలా సుమారు 2.50 కిలోమీటర్ల మేర పైపులైన్ ఏర్పాటు చేసేందుకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ పైపులైన్ ఏర్పాటుతో చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు భూగర్భ జలాల మట్టం కూడా మెరుగుపడుతుందని అధికారులు తెలిపారు. అలాగే జిల్లా వాటర్ షెడ్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో చెరువు కట్టపై చిన్నారుల కోసం ప్రత్యేకంగా చిల్డ్రన్ పార్క్, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందువల్ల చెరువు పరిసర ప్రాంతం కుటుంబాలతో కలిసి సందర్శించదగిన ప్రజా వినోద కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. అధికారుల అంచనా ప్రకారం పైపులైన్ ఏర్పాటుకు సుమారు రూ.3 కోట్లు, చిల్డ్రన్ పార్క్, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు సుమారు రూ.46 లక్షల వ్యయం కావచ్చని అధికారులు వివరించారు. జిల్లాలో నీటి వనరుల సంరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఇరిగేషన్, డ్వామా, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జాతీయ కాంగ్రెస్ పార్టీలోకి 50 మంది ప్రముఖులు చేరిక

**-సాదరంగా ఆహ్వానించిన పీసీసీ జనరల్ సెక్రెటరీ షేక్ అల్లాబకష్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు మహబూబ్ బాషా**



**రాయచోటి – సూర్య వాస్తవం:** పిసిసి జనరల్ సెక్రెటరీ షేక్ అల్లాబకష్ (సీఎల్బీ), కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు మహబూబ్ బాషాల సమక్షంలో గురువారం మదనపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్ రెడ్డి సాహెబ్ ఆధ్వర్యంలో మదనపల్లికి చెందిన 50 మంది ప్రముఖులు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల పాలన పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రజా యువ నాయకుడు రాహుల్ గాంధీ ప్రజల కోసం పోరాడుతున్న పనితీరు పట్ల ఆకర్షితుడై ఆ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పిసిసి సెక్రెటరీ షేక్ అల్లాబకష్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వ విధ్వంస పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలంతాఒకటవుతున్నారని అన్నారు. దేశ భవిష్యత్ కోసం కాంగ్రెస్ పార్టీని 2029లోఅధికారంలోకి తెచ్చేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉండాలండి ఆయన పిలుపునిచ్చారు. ఇక కాంగ్రెస్ పార్టీలోవలసలు కొనసాగుతూనే ఉంటాయని, అన్నారు. ఎన్నికలు ఎప్పుడు వస్తాయాఅని, మోడీని కుర్చీ ఎప్పుడు దింపాల అని, రాహుల్ గాంధీని ప్రధాని చేయాలని ప్రజలనుకుంటున్నారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహబూబ్ బాషా, రెడ్డి సాహెబ్ లు మాట్లాడుతూ ఈ దేశ భవిష్యత్తు కోసం రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ అవసరం ఎంతో ఉందని, ప్రతి ఒక్కరూ గ్రహించాలని ఆలోచి ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త ఒక సైనికుడులగ పనిచేసి కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాల బాలికల భద్రతపై అవగాహన





**గుత్తి – సూర్య వాస్తవం:** గుత్తి పట్టణం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అనంత పురం జిల్లా పోలీసు శాఖ, గుత్తి పోలీసు అధికారుల ఆధ్వర్యంలో మహిళలు మరియు బాల బాలి కల భద్రత పై అవగాహన కార్యక్రమ ము జరిగినది.ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా మహిళా పోలీసు ఇన్స్ పెక్టర్ వెంకటేశ్వర రావు,ము న్సిపల్ కమీషనర్ బి.జబ్బార్ మియా, గుత్తి సి.ఐ రామారావు, మెప్మా టి.ఎం.సిలు శ్రీనివాస రెడ్డి,చంద్ర శేఖ ర్,పోలీసు శాఖ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ మహిళా పోలీ సులు,మెప్మా ఆర్.పిలు,మహి ళా సంఘాల ప్రతినిధులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారందరు మహిళల భద్రత,బాలల బాలికల భద్రతపై ప్రస్తుతం సమాజంలో మహిళలు తమను తాము రక్షించుకొనుట కు శక్తి యాప్ ద్వారా కేవలం తమకు రక్షణ కావాలని కంప్లైంట్ ఆప్షన్ యందు నమోదు చేసిన వెంటనే సహాయం కావలసిన ప్రాంతానికి పోలీసు చేరుకుని రక్షణ కల్పించే విష యాన్ని తెలియజేశారు.మొబైల్ ద్వారా 100,102 కాల్ సెంటర్ నెంబర్లకు ఫోన్ కూడా చేసి తమ సమస్య ను తెలియ పరచవచ్చని తెలిపారు. సామాజిక మాధ్యమాలు అయిన ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, ఫేస్ బుక్, ట్విట్టర్ వంటి మొబైల్ యాప్స్‌లో బాల బాలికల ప్రవర్తనను, చాటింగ్,ప్రొఫైల్ ఫోటోలను ఎప్పటికప్పుడు ప్రమాదాలు రాకుండా తల్లి తండ్రులు గమనిస్తూ ఉండాలని సూచించారు. వయసు పరిమితి మించని బాల బాలికలకు బైక్ లు,స్కూటీలు నడి పించే అవకాశం ఇవ్వరాదు అన్నారు. మహిళలందరూ ప్రస్తుతం సమాజంలో జరుగుతు న్న సమస్యాత్మక పరిస్థితుల నుండి ఎలా పోలీసు శాఖ వారి సహాయం పొందవచ్చునో తెలియజేసి ప్రభు త్వం అందిస్తున్న రక్షణ పరమైన అ వకా శాలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# పట్టణంలో విస్తృత ఫుల్ పెట్రోలింగ్

**- ఎస్ఐలు తిరుపాల్ నాయక్, తాహిర్ హుస్సేన్**



**వేంపల్లె – సూర్య వాస్తవం :** వేంపల్లె పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం కలిగించేలా వాహనాలు రోడ్లపై పెడితే అలాంటి వారికి ట్రాఫిక్ చలానాలు, కఠిన చర్యలు తప్పవని వేంపల్లె ఎస్ఐలు తిరుపాల్ నాయక్, తాహిర్ హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా వేంపల్లె లో ట్రాఫిక్ పై ప్రత్యేక దృష్టి సాధించారు. వేంపల్లెలోని బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ నుండి నాలుగు రోడ్ల కూడలి ప్రాంతంలో, స్టేట్ బ్యాంకు వరకు అంతరాయం కలిగించేలా రోడ్లపై వాహనాలు నిలిపిన, ట్రాఫిక్ అంత రాయం కలిగించేలా బోర్డులు, బైకులు, తోపుడు బండ్లు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకా ణాల వద్ద మోటార్ బైకులు కూడా క్రమ పద్ధతిలో రాకపోకలకు అందరం కలగకుండా పార్కింగ్ చేసుకోవాలన్నారు. రోడ్డు పనులు జరుగుతున్న కారణంగా ప్రజలు అందరూ సహకరించాలని కోరారు.

## దళితుల వ్యతిరేకి జగన్మోహన్ రెడ్డి

**- ఎమ్మెల్యే కోట్ల, వై.నాగేశ్వరరావు యాదవ్, డీసీఎంఎస్ ఛైర్మన్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు**




**ప్యాపిలి – సూర్య వాస్తవం :** ప్యాపిలి పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం ఎమ్మెల్యే సూర్య ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో గత వైసీపీ ప్రభుత్వ వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వం దళితులపై జరిపిన హత్యలు, వారిపై జరిగిన దాడులు హేయమైన చర్య అనంతబాబు తన డ్రైవర్ సుబ్రహ్మణ్యంను చంపి డోర్ డెలివరీ చేయడం నేడు ఆయన వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. అలాగే డాక్టర్ సుధాకర్ మాస్కులు అడిగినందుకు పిచ్చివాడిగా చిత్రీకరించి గుండు కొట్టించి చివరికి చంపిన గత వైసీపీ ప్రభుత్వం దళితులకు భయభ్రాంతులకు గురిచేసినందుకు వారి రాక్షస పాలనా వల్ల రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెప్పారని ఈ సందర్భంగా తెలియజేశారు. దళితులకు ఎల్లప్పుడూ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పేదలపార్టీ అంటేనే ఎన్డీఏ పార్టీ అని ఈ సందర్భంగా తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు పంపిణీ



**శింగనమల- సూర్య వాస్తవం :** సింగనమల మాజీ మంత్రి వైఎస్ఆర్సిపి సమన్వయకర్త సాకే శైలజనాథ్ ఆదేశాల మేరకు సింగనమల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు పంపిణీ చేసిన వైసిపి మండల పబ్లిక్ సిటీ వింగ్ అధ్యక్షులు నాగులగుడం దాసరి వెంకటరమణ.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగనమల మండలం నాగులగుడ్డం గ్రామానికి చెందిన వన్నూరప్ప భార్య లక్ష్మీనారాయణమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న దాసరి వెంకటరమణ సింగనమల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు అనంతరం ఆమెతో పాటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. అలాగే రోగులతో వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం దాసరి వెంకటరమణతో పాటు వచ్చిన వైసీపీ నాయకులు సింగనమల నియోజకవర్గం యూత్ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, సింగనమల సోషల్ మీడియా ప్రెసిడెంట్ రాజు, చిన్న జలాలపురం బ్యాళ్ల శ్రీనివాసులు, బ్యాళ్ల జస్వంత్, రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాగలగుడం గ్రామానికి చెందిన ఆది శరత్ రెడ్డి, శోధన పల్లి గిరి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్‌సిలో టాపర్‌గా నిలిచిన హరితకు ల్యాబ్ ట్యాబు బహుకరణ



**గార్లదిన్నె – సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా, సింగనమల మండలం, ముంటిమడుగు గ్రామంలో నారాయణస్వామి మాధవి దంపతుల కుమార్తె రామగాని హరిత కల్లూరు జడ్పీ హైస్కూల్‌లో ఎస్ఎస్సి 600/ 592 మార్కులు సాధించిన మండల టాపర్ గా నిలిచిన అమ్మాయిని కిరణ్ కుమార్ గౌడ్ అభినందించి ల్యాప్‌టాప్ మరింత కేజీటీ (కిరణ్ గౌడ్ ట్రస్ట్) ట్రస్ట్ షరతులకు లోబడి, ఇంటర్మీడియట్ ఆమె ఎంపిక చేసుకున్న ప్రొఫెషనల్ కోర్సు పూర్తి చేసే వరకు బాలిక, విద్యా దత్తత (ఫీజు పుస్తకాలు హాస్టల్ వంటి మొత్తం భవిష్యత్తు విద్యా వ్యయాన్ని భరిస్తుంది సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు. ఈ కార్యక్రమంలో గాదిలింగేశ్వర గౌడ్. నశీదిష్ గౌడ్, మంజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జనగణనను వంద శాతం పూర్తి చేయాలి తహసీల్దార్



**మడకశిర – సూర్య వాస్తవం :** రొళ్ల మండలంలో జనగణన ప్రక్రియను 100 శాతం విజయవంతంగా పూర్తి చేయాలి. ఆదేశాలు జారీ చేసిన తహసీల్దార్ చంద్రశేఖర్.స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నాడు ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సూపర్వైజర్లు తమ పరిధిలోని ఇళ్లను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎవరైనా జాబితాలో మిస్ అయి ఉంటే వారి వివరాలను వెంటనే నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామ రెవెన్యూ అధికారులు, మరియు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# దేశ సాంకేతిక విప్లవానికి ఆద్యుడు దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ

**- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్.రెడ్డీ సాహెబ్**



**మదనపల్లి – సూర్య వాస్తవం:** దేశంలో శాస్త్ర సాంకేతిక రంగానికి బలమైన పునాదులు వేసిన మహానీయుడు, భారతరత్న దివంగత ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ అని మదనపల్లె కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.రెడ్డీ సాహెబ్ అన్నారు. భారత సమాచార విప్లవ పితామహుడు, మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం మదనపల్లె పట్టణంలోని ఇందిరా నగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.రెడ్డీ సాహెబ్ మాట్లాడుతూ ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. మాజీ ప్రధాని,ఆధునిక భారత స్వాప్నికుడు, సాంకేతిక సంస్కరణల సృష్టికర్త, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా మహనీయుడికి అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ పక్షాన ఘనంగా నివాళులు అర్పించారు. ప్రపంచం ముంగిట నేడు అగ్రగామిగా దేశం ఉందంటే నాడు రాజీవ్ గాంధీ కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన సంస్కరణల పుణ్యమే. విద్య, సాంకేతికత, టెలి కమ్యూనికేషన్, గ్రామీణాభివృద్ధి, ఆర్థిక సంస్కరణలు దేశ ప్రగతికి మూల స్తంభాలు. ఐటీ రంగానికి పితామహుడుగా, టెలికమ్యూనికేషన్ విప్లవానికి ఆద్యుడుగా, దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లిన దార్శనికుడిగా రాజీవ్ గాంధీ ది ఎన్నటికీ చెరగని ముద్ర. గ్రామ స్వరాజ్య సాధనకు పునాదులు వేసి, స్థానిక సంస్థల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు , యువతకు 18ఏళ్లకే ఓటు హక్కు కల్పించి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కీలక సంస్కరణలు తీసుకొచ్చిన రాజీవ్ గాంధీ పాలన ఆచరణీయం. ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్ గాంధీ చూపిన బాట నేడు ప్రతి ఒక్కరికి ఎంతో స్ఫూర్తిదాయకం.

రాజీవ్ గాంధీ హత్యకు గురైన తరువాత ఈ రోజును దేశంలో ఉగ్రవాద రహిత దినోత్సవం గాజరుపుకుంటున్నామన్నారు. దేశంలో సమాచార సాంకేతిక రంగానికి బలమైన పునాదులు వేసి, యువతకు నూతన అవకాశాల దారులు తెరిచిన మహానేత రాజీవ్ గాంధీ అని అన్నారు. కంప్యూటర్ విప్లవం, టెలికమ్యూనికేషన్ రంగ అభివృద్ధి, సాంకేతిక రంగ అభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం వంటి కీలక సంస్కరణల ద్వారా భారతదేశాన్ని ఆధునిక యుగంలోకి తీసుకెళ్లిన మహానాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని రెడ్డి సాహెబ్ కొనియాడారు. యువత శక్తిపై అపార విశ్వాసం ఉంచిన రాజీవ్ గాంధీ, దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని నమ్మారని గుర్తు చేశారు. 18 సంవత్సరాల యువతకు ఓటు హక్కు కల్పించడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థలో యువశక్తికి ప్రాధాన్యం పెంచారని పేర్కొన్నారు. సాంకేతికతను గ్రామీణ ప్రాంతాలకు తీసుకెళ్లి, దేశ అభివృద్ధిని వేగవంతం చేయాలన్న రాజీవ్ గాంధీ ఆశయాలను, ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మీనా కుమారి, మాజీ మండలాధ్యక్షులు ముబారక్ ఖాన్, మాజీ డిసిసి సెక్రటరీ డా వర్ధన్ చౌదరి, మాజీ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు సోమశేఖర్, మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ మహబూబ్ పేరు, మాజీ మహిళా టౌన్ ప్రెసిడెంట్ ఈశ్వరమ్మ, మాజీ మండల బీసీ సెల్ అధ్యక్షులు నాగరాజ, మాజీ టౌన్ సెక్రటరీలు పాలేటి, మహమ్మద్ అలీ, యూత్ కాంగ్రెస్ నాయకులు శరత్ కుమార్ రెడ్డి, మైనార్టీ నాయకులు యూసుఫ్ ఖాన్, ఇర్ఫాన్, దస్తగిరి ఖాన్, ఉస్మాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- **మహిళల భద్రతపై విస్తృత అవగాహన**
- **మహిళలు శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి**
- **మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్.ఐ. కే.శాంతమ్మ**




**చెన్నూరు- సూర్య వాస్తవం :** మహిళలు మహిళా చట్టాలపై, వారి హక్కుల పై అవగాహన పెంపొందించుకోవాలని కడప మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ శాంతమ్మ తెలిపారు. గురువారం ఆమె స్థానిక స్త్రీ శక్తి భవన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహిళల భద్రత, రక్షణ చట్టపరమైన హక్కులు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మహిళలతో మాట్లాడుతూ,ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెన్నూరు గ్రామంలో మహిళల భద్రత, రక్షణ చట్టపరమైన హక్కులపై విస్తృత అవగాహన అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతున్నదని ఆమె తెలిపారు. ముఖ్యంగా మహిళలు, యువతులు, విద్యార్థినులు, మహిళల భద్రత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అలాగే మహిళలు పాటించవలసిన పద్ధతులు గురించి మహిళలకు తెలియజేయడం జరిగింది. దీనిపై పోలీస్ శాఖ అనేక కార్యక్రమాలు చేపట్టి మహిళలకు మహిళా భద్రత చట్టాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. మహిళలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ధైర్యంగా ఉండాలని. ఏవైనా సమస్యలు ఉంటే అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందన కోసం డయల్ 100/112 సేవలను వినియోగించుకోవాలని, అలాగే మహిళల రక్షణ కోసం రూపొందించిన శక్తి యాప్‌ను ప్రతి ఒక్కరూ తమ మొబైల్



ఫోన్లలో తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలియజేశారు.ఈ శక్తి యాప్ ద్వారా మహిళలు ఫోన్ చేస్తే ప్రమాద సమయంలో, పోలీసులు తక్షణ సమాచారం అందుకొని తమ సహాయ సహకారాలు అందజేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. అదేవిధంగా బాల్య వివాహాల వల్ల బాలికల భవిష్యత్తుపై పడే ప్రతికూల ప్రభావాలను వివరించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అలాంటి ఘటనలు ఎక్కడైనా గుర్తించి వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. మహిళలపై వేధింపులు, గృహహింస, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు వంటి అంశాలపై ప్రత్యేక చట్టాలు అమల్లో ఉన్నాయని, బాధితులు నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. మహిళలు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మహిళల రక్షణ కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ప్రజలు పోలీసులకు సహకరించాలనిఆమె కోరారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీరాములు, ఏపియం వెంకటేష్, మహిళా కానిస్టేబుల్ లక్ష్మి, డ్వాక్రా మహిళలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**- జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాజా మౌనద్దీన్**



**వేంపల్లె – సూర్య వాస్తవం :** వేంపల్లె మండల పరిధిలోని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ముత్తుకూరు విలేజ్ హెల్త్ క్లినిక్‌ను జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డిప్యూటీ డిఎంహెచ్ఓ) డాక్టర్.ఖాజా మౌనద్దీన్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్లినిక్‌లోని రికార్డులను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలను, మందుల నిల్వలను ఆయన అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు శాతాన్ని, విధులకు వారు సకాలంలో హాజరవుతున్నారా లేదా అనే విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాజా మౌనద్దీన్ మాట్లాడుతూ, వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దోమకాటు వలన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి ప్రమాదకరమైన వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, వీటి పట్ల ప్రజలు తీవ్ర అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరం, ఒంటి నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని హెల్త్ క్లినిక్ లేదా ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి ఉచితంగా వైద్య సేవలు పొందాలని ఆయన కోరారు. సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ,గ్రామీణ ప్రాంతాల్లో దోమల నివారణకు పంచాయతీ సిబ్బంది సహకారంతో యాంటీ లార్వా పిచికారీ చర్యలు ముమ్మరం చేస్తామని ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం 'డ్రై డే'గా పాటించాలని, ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నా మని, ప్రజలు దోమతెరాలు వాడాలి అని ప్రజల్లో అంటువ్యాధుల పట్ల అవగాహన కల్పించేందుకు వైద్య సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నరేష్, ఆరోగ్య కార్యకర్త నాగలక్ష్మి దేవి, పాల్గొన్నారు.

# పొలిటికల్ ఎంట్రీపై తిరుగులేని క్లారిటీ ఇచ్చిన రామ్ చరణ్

- రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదని స్పష్టం చేసిన రామ్ చరణ్
- చిత్ర పరిశ్రమలో నంబర్ వన్ కావడమే తన లక్ష్యమని వెల్లడి
- 'పెద్ది' తన కెరీర్‌లో ఎంతో నిజాయతీగా చేసిన చిత్రమని వ్యాఖ్య
- డూప్ లేకుండా స్టంట్స్ చేయడం తనకిష్టమని, తండ్రే స్ఫూర్తి అని వెల్లడి
- బుచ్చిబాబు దర్శకత్వంలో 'పెద్ది' జూన్ 4న పాన్ ఇండియా స్థాయిలో విడుదల



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తన రాజకీయ ప్రవేశంపై వస్తున్న ఊహాగానాలకు స్పష్టత ఇచ్చారు. తనకు రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదని, సినిమా రంగంలో అగ్రస్థానానికి చేరడమే తన లక్ష్యమని తేల్చి చెప్పారు. తన తాజా చిత్రం 'పెద్ది' ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. "అభిమానులు మిమ్మల్ని సీఎంగా చూడాలను కుంటున్నారు, మీరు రాజకీయాల్లోకి వస్తారా?" అన్న ప్రశ్నకు చరణ్ బదులిస్తూ.. "రెండు పడవలపై ప్రయాణం చేయాలనుకోవడం లేదు. నా పూర్తి దృష్టి నటనపైనే ఉంది... నటనా రంగంలో మేటిగా నిలవడంపైనే నా దృష్టంతా!" అని అన్నారు.

తన కొత్త సినిమా 'పెద్ది' గురించి మాట్లాడుతూ, ఇది తన కెరీర్‌లో ఎంతో నిజాయతీగా చేసిన చిత్రమని తెలిపారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో, తన అస్తిత్వాన్ని వెతుక్కునే 'పెద్ది' అనే యువకుడిగా కనిపిస్తానని వివరించారు. ఈ పాత్ర కోసం శారీరకంగా, మానసికంగా ఎంతో కష్టపడ్డానని చెప్పారు. క్రీడా నేపథ్య డ్రామాగా వస్తున్న ఈ సినిమా తప్పకుండా ఆకట్టుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

రిస్కీ షాట్లలో డూప్‌ల సహాయం లేకుండా నటించడానికే ఇష్టపడతానని, తన తండ్రి చిరంజీవి 71 ఏళ్ల వయసులో కూడా స్టంట్స్ చేస్తున్నారని, అలాంటి సన్నివేశాలు ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతాయని రామ్ చరణ్ పేర్కొన్నారు. బుచ్చిబాబు దర్శకత్వం వహించిన 'పెద్ది' చిత్రం జూన్ 4న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.



## చిరు నయా సినిమా షురూ

'వాల్తేర్ వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తరువాత చిరంజీవి, డైరెక్టర్ బాబీ కొల్లి క్రేజీ కాంబోలో తెరకెక్కుతున్న నయా సినిమా గురువారం ఆరంభమైంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాత వెంకట్ కె నారాయణ నిర్మిస్తున్నారు. కన్నడ, తమిళ, హిందీ భాషల్లో పలు భారీ ప్రాజెక్టులను అందించిన కేవీఎన్ ప్రొడక్షన్స్ తెలుగులో నిర్మిస్తున్న తొలి చిత్రం ఇది. ఇప్పటికే వరుస అప్డేట్స్‌తో భారీ అంచనాలు సృష్టించిన ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది.

పవన్ కళ్యాణ్, నాగబాబు ముఖ్య అతిథులుగా విచ్చేసి ఈ కార్యక్రమాన్ని మరింత వైభవంగా మార్చారు. ఈ మెగా త్రయం వేదికను పంచుకోవడం అభిమానులకు కనులవిందు చేసింది. పవన్ కళ్యాణ్ క్లాప్‌బోర్డ్ కొట్టగా, సుష్మిత కొణిదెల కెమెరా స్విచ్ ఆన్ చేశారు. వి.వి. వినాయక్ ఫస్ట్ షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు.

బి. గోపాల్, కోదండరామి రెడ్డి, నాగబాబు చిత్ర బృందానికి స్క్రిప్ట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖ దర్శకులు, నిర్మాతలు హాజరయ్యారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ నుంచి లోహిత్ తన బృందంతో కలిసి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. దర్శకుడు బాబీ కొల్లి ఈసారి మరింత భారీ కథను సిద్ధం చేశారు. మ్యాసీవ్ స్కేల్, ఇంటెన్సిటీ తో నిండిన ఈ కథలో చిరంజీవి తన కెరీర్‌లోనే అత్యంత పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు.

ఈ చిత్రంలో మలయాళ నటి అనస్వర రాజన్ కీలక పాత్రలో నటించనున్నారు. చిరంజీవి నటిస్తున్న ఈ 158వ సినిమా రెగ్యులర్ షూటింగ్ నేటి (శుక్రవారం) నుంచి హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది. ఈ సినిమాకి రచన, దర్శకత్వం: బాబీ కొల్లి, నిర్మాత: వెంకట్ కె నారాయణ, సంగీతం: థమన్ ఎస్, స్క్రీన్ ప్లే రైటర్స్: కోన వెంకట్, కె చక్రవర్తి రెడ్డి, అడిషినల్ స్క్రీన్ ప్లే రైటర్స్: హరి మోహన కృష్ణ, వినీత్ పొట్లూరి, డీఓపీ : విజయ్ కార్తీక్ కన్నన్, ఎడిటర్: ఆంటోనీ రూబెన్, ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శరణ్య పోట్ల.



# గుజరాత్ దెబ్బకు చెన్నై కథ సమాప్తం... ఐపీఎల్-2026 నుంచి సీఎస్కే ఔట్

- చెన్నైపై 89 పరుగుల భారీ తేడాతో గుజరాత్ టైటాన్స్ విజయం
- ఈ ఓటమితో ప్లే ఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించిన సీఎస్కే
- గిల్, సాయి సుదర్శన్, బట్లర్ అర్ధశతకాలతో గుజరాత్ భారీ స్కోరు
- లక్ష్య ఛేదనలో 140 పరుగులకే కుప్పకూలిన చెన్నై సూపర్ కింగ్స్
- బౌలింగ్‌లో సిరాజ్, రబాడ, రషీద్ ఖాన్ మూడేసి వికెట్లతో చెలరేగారు



ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) ప్రస్థానం ముగిసింది. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో 89 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలై ప్లే ఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. ఈ విజయంతో గుజరాత్ ప్లే ఆఫ్స్‌లో టాప్-2 స్థానాన్ని దాదాపు ఖాయం చేసుకుంది.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ టైటాన్స్‌కు ఓపెనర్లు శుభ్‌మన్ గిల్ (37 బంతుల్లో 64), సాయి సుదర్శన్ (53 బంతుల్లో 84) అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 125 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. ఆ తర్వాత వచ్చిన జాస్ బట్లర్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 27 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 57 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీంతో గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 229 పరుగుల భారీ స్కోరు సాధించింది. 230 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో చెన్నై సూపర్ కింగ్స్ ఆది నుంచే తడబడింది. ఇన్నింగ్స్ తొలి బంతికే సంజూ శాంసన్ డకౌట్ అయ్యాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (16) మెరుపులు తాత్కాలికమే అయ్యాయి. మహమ్మద్ సిరాజ్ తన తొలి ఓవర్లలోనే కీలక వికెట్లు పడగొట్టి చెన్నైని కోలుకోలేని దెబ్బ తీశాడు. శివమ్ దూబే (17 బంతుల్లో 47) ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో చెన్నై 13.4 ఓవర్లలో 140 పరుగులకే కుప్పకూలింది. గుజరాత్ బౌలర్లలో మహమ్మద్ సిరాజ్, కగిసో రబాడ, రషీద్ ఖాన్ తలా మూడు వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.

## అతడ్ని సచిన్ వారసుడు అనకండి: దినేశ్ కార్తీక్

యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని సచిన్‌తో పోల్చవద్దన్న దినేశ్ కార్తీక్ ఐపీఎల్ 2026లో 15 ఏళ్ల వైభవ్ అద్భుత ప్రదర్శనవైభవ్‌కు మైదానం బయట సవాళ్లే ఎక్కువగా ఉంటాయని డీకే అభిప్రాయంఐపీఎల్ స్వరూపం పూర్తిగా మారిపోయిందని వ్యాఖ్యప్రస్తుతం ఆర్సీబీకి బ్యాటింగ్ కోచ్, మెంటార్‌గా ఉన్న దినేశ్ కార్తీక్ భారత మాజీ వికెట్ కీపర్, బ్యాటర్ దినేశ్ కార్తీక్.. 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్‌తో పోల్చవద్దని సూచించాడు. అద్భుత ప్రతిభ కనబరుస్తున్న ఆ కుర్రాడిపై అనవసరమైన పోలికలతో భారం మోపవద్దని, అతడికి ఎదురయ్యే సవాళ్లు విలక్షణంగా ఉంటాయని హితవు పలికాడు. సచిన్ వారసుడ అతడే అనడం ఏమంత సమంజసం కాదని అభిప్రాయపడ్డాడు.



ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతున్న లెఫ్ట్ హ్యాండ్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ, ఇప్పటివరకు 13 మ్యాచ్‌లలో 579 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ముఖ్యంగా, 236.32 స్ట్రైక్ రేట్‌తో విధ్వంసకర బ్యాటింగ్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు.

ఈ నేపథ్యంలో ఐకూ క్వెస్ట్ టాక్ పాడ్‌కాస్ట్‌లో కార్తీక్ మాట్లాడుతూ, "వైభవ్ బ్యాటింగ్ ప్రదర్శన చాలా ప్రత్యేకం. కానీ ప్రజలు అతడిని 'సచిన్ వారసుడు' అని ట్యాగ్ చేయొద్దని కోరుకుంటున్నాను. సచిన్ సాధించింది అసాధారణం. వైభవ్‌కు ఎదురయ్యే సవాళ్లు పూర్తిగా భిన్నంగా ఉంటాయి. సచిన్‌కు మైదానంలో, బయట సవాళ్లు ఎదురైతే, వైభవ్‌కు మాత్రం మైదానం బయటే ఎక్కువ సవాళ్లు ఉంటాయి. ఎందుకంటే అతడికి అద్భుతమైన క్రికెట్ నైపుణ్యాలు ఉన్నాయి, కానీ క్రీడకు సంబంధం లేని బయటి విషయాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని వివరించాడు.

ఇదే సందర్భంగా ఐపీఎల్ ప్రస్థానం గురించి కూడా కార్తీక్ మాట్లాడాడు. "2008లో ప్రారంభమైన ఐపీఎల్‌కు, ఇప్పటికి చాలా తేడా ఉంది. డేటా, గణాంకాల వాడకం విపరీతంగా పెరిగింది. ఇది ఎందరికో జీవనశైలిని అందిస్తూ, యువ క్రీడాకారులకు బలమైన కెరీర్ ఆప్షన్‌గా మారింది. అతి తక్కువ కాలంలోనే ప్రపంచంలోని ఇతర క్రీడా టోర్నమెంట్‌లతో పోటీ పడుతోంది" అని అన్నాడు.

# రాజీవ్ గాంధీ గొప్ప దార్శనికుడు, రాజనీతిజ్ఞుడు

## - డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం :** భారత మాజీ ప్రధాని,కాంగ్రెస్ పార్టీ మాజీ జాతీయ అధ్యక్షులు, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ గొప్ప దార్శనికుడు, రాజనీతిజ్ఞుడని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి కీర్తించారు. గురువారం వేంపల్లిలో కాంగ్రెస్ నాయకులు రాజీవ్ గాంధీ 35వ వర్ధంతిని ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ 1985 నుంచి 1991 వరకు ఆరు సంవత్సరాల పాటు ఏఐసిసి అధ్యక్షులుగా రాజీవ్ గాంధీ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. 1984 నుంచి 1989 వరకు ఐదు సంవత్సరాల పాటు భారత ప్రధానిగా దేశానికి ఎనలేని సేవ చేశారు. . జాతి నిర్మాణంలో యువతకు ఎక్కువ ప్రాధాన్యత కల్పించాలన్న ఉద్దేశంతో ఓటు కనిష్ట వయోపరిమితిని 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు తగ్గించిన యువత పక్షపాతి రాజీవ్ అన్నారు. స్థానిక ప్రభుత్వాలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించి మహిళా సాధికారతకు కృషి చేసిన మహిళా పక్షపాతి.. 73, 74 రాజ్యాంగ సవరణ చట్టాల ద్వారా స్థానిక సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించి బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి బాట వేసిన దార్శనికుడు. దేశంలో ఎలక్ట్రానిక్, సమాచార విప్లవానికి ఆద్యుడు. ఈనాడు ప్రతి ఒక్కరి చేతిలో టెలిఫోన్ ఉంది అంటే దానికి కారకుడు రాజీవ్.ఈనాడు ప్రతి ఒక్కరి ఇంట్లో టీవీ ఉంది అంటే దానికి కారకుడు రాజీవ్. 1991 మే 21న తమిళనాడులోని శ్రీపెరంబదూరు వద్ద ఎల్ టి టి ఈ ఉగ్రవాదుల దురాగతానికి రాజీవ్ గాంధీ బలైపోయారు. అందుకే మే 21ని ఉగ్రవాద వ్యతిరేక దినంగా జరుపుకుంటున్నామని తులసి రెడ్డి అన్నారు. రాజీవ్ జీవించింది కేవలం 47 సంవత్సరాలు మాత్రమే. ఎన్నాళ్లు జీవించామన్నది కాదు. జీవించిన కాలములో ఏమి చేసాము అన్నది ముఖ్యం. రాజీవ్ గాంధీ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శం, అనుసరణీయం,మార్గదర్శకం, స్ఫూర్తిదాయకం అని తులసి రెడ్డి కొనియాడారు.ఈ కార్యక్రమంలో పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గపు కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి,వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు బీగాల రామకృష్ణ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు నర్రెడ్డి అలివేలమ్మ, ఉత్తన్న, బద్రీనాథ్, రాఘవయ్య, శేఖర్, శివ నామా వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# మన ఊరు -మన జెండా కార్యక్రమానికి విశేష స్పందన

## భారీగా బీజేపీలో చేరిన యువత, కుటుంబాలు



**ప్యాపిలి– సూర్య వాస్తవం :** నంద్యాల జిల్లా ప్యాపిలి మండలంలోని మామిళ్లపల్లి మరియు బోయిన చెరువుపల్లి గ్రామాలలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన “మన ఊరు -- మన జెండా” కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. కార్యక్రమం అనంతరం గ్రామాల పెద్దలు, యువత మరియు పలు కుటుంబాలు భారీ సంఖ్యలో భారతీయ జనతా పార్టీలో చేరారు.ఈ కార్యక్రమానికి బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు డాక్టర్ అభిరుచి మధు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్యాపిలి మండల అధ్యక్షులు దామోదర్ నాయుడు అధ్యక్షతన, మండల ఇన్‌చార్జ్ అంబటి సుబ్బారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సందు వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఒంటెద్దుబండి కిరణ్, కిసాన్ మోర్చా రాయలసీమ జోన్ ఇన్‌చార్జ్ తిమ్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కేసీ మద్దిలేటి, బీజేపీ యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ భాస్కర్ సొప్పాకుల, యువ మోర్చా ప్యాపిలి మండల అధ్యక్షుడు పీ. శివ కేశవ్ తదితరులు పాల్గొన్నారు. మామిళ్లపల్లి గ్రామంలో చక్క మద్దిలేటి, మైల మహేంద్ర, ఓబులరెడ్డి, సాయి, మల్లికార్జున, సోమశేఖర్, నాగేశ్వరరావు, పెద్ద ఓబయ్య, సుంకన్న, రంగస్వామి, లక్ష్మిరెడ్డి, రామచంద్ర, నాగేష్ తదితర యువకులు బీజేపీలో చేరారు. అలాగే బోయిన చెరువుపల్లి గ్రామంలో మల్లయ్య, వెంకటరాముడు, రాజు, శ్రీనివాసులు, గాజుల వెంకటరాముడు, వారి అనుచరులతో కలిసి సుమారు 10 కుటుంబాలు భారతీయ జనతా పార్టీలో చేరాయి.



ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు డాక్టర్ అభిరుచి మధు మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వల్ల ప్రజలు బీజేపీ వైపు ఆకర్షితులవుతున్నారని అన్నారు. పేదల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో కేంద్ర ప్రభుత్వం అనేక చారిత్రాత్మక కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, జల్ జీవన్ మిషన్, ఆయుష్మాన్ భారత్, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, స్వచ్ఛ భారత్ మిషన్ వంటి పథకాల ద్వారా కోట్లాది మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, రైతు సంక్షేమం విషయంలో బీజేపీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలు విశ్వసించి పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామంలో బీజేపీ జెండా ఎగురవేసి, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# హిందూ స్మశాన వాటికకు స్థలం కొరత..

## - పెరిగిన ముళ్లపొదలు.. పట్టించుకోని అధికారులు



**ఉరవకొండ - సూర్య వాస్తవం:** పట్టణంలోని వెలిగొండ రహదారిలో ఉన్న హిందూ స్మశాన వాటిక సమస్య రోజురోజుకు తీవ్రమ వుతోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వసతులు లేకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు.

**ప్రధాన సమస్యలు**

జనాభా పెరుగుతున్నా స్మశాన వాటిక విస్తీర్ణం పెంచకపోవడంతో, చనిపోయిన వారి సమాధి కోసం స్థలం వెతకడమే ఒక పెద్ద సవాలుగా మారింది. కొన్నిసార్లు పాత సమాధుల పక్కనే కొత్తవి తవ్వాల్సి వస్తోంది. స్మశాన వాటిక మొత్తం కంపచెట్లు, ముళ్ల పొదలతో నిండిపోయింది. పాత సమాధులు ఎక్కడున్నాయో కూడా గుర్తుపట్టలేక బంధువులు తీవ్ర భావోద్వేగానికి గురవుతున్నారు. అంత్యక్రియలకు వచ్చే ప్రజలకు తాగునీరు, కూర్చునేందుకు షెడ్, కనీసం నడవడానికి సరైన రోడ్డు మార్గం కూడా లేదు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో, రాత్రి వేళల్లో అంత్యక్రియలు నిర్వహించాల్సి వస్తే మొబైల్ లైట్లు, టార్చ్ లైట్లే దిక్కవుతున్నాయి. వర్షం పడితే స్మశాన వాటిక అంతా బురదమయంగా మారుతోంది. ఆ బురదలోనే మృతదేహాలను మోసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. బాధలో ఉన్న కుటుంబాలకు సమాధి స్థలం కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి రావడం మృతుల పట్ల గౌరవానికి విరుద్ధంమని స్థానికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ ద్వారా శుభ్రత: తక్షణమే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ముళ్లకంపలను తొలగించి, అంతర్గత రోడ్లు ఏర్పాటు చేయాలి. స్మశాన వాటికలో తాగునీరు, విద్యుత్ దీపాలు, ఒక విశ్రాంతి షెడ్ నిర్మించాలి.

**అదనపు భూమి కేటాయింపు:** పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం స్పందించి, అదనపు భూమిని సేకరించి హిందూ స్మశాన వాటికకు కేటాయించాలి. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ అధికారులు ఇప్పటికైనా నిద్ర మత్తు వీడి స్పందించాలి. నిర్లక్ష్యం వీడి సమస్యను పరిష్కరించకపోతే భవిష్యత్తులో పరిస్థితి మరింత క్లిష్టంగా మారే అవకాశముందని పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజల పక్ష నాయకుడు...వెంకట ప్రసాద్ !

## - ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటుపడే నాయకుడు
## - వీధి కుళాయిలకు నీరు రాక కాలనీవాసుల అవస్థలు
## - అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారణ





**అనంతపురం - సూర్య వాస్తవం :** ఒక నాయకుడు పనితీరు ప్రజలకు ఎంత అందు బాటులో ఉంటున్నారు, అవినీతి రహితంగా పాలన అందిస్తున్నారా మరియు అభివృద్ధి పనుల్లో వార్డు ప్రజలను భాగస్వామ్యం చేస్తు న్నారా అనే అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఇలా వార్డులో ప్రజలకు అత్యంత చేరువలో ఉండి స్థానిక సమస్యలను స్వయంగా పర్య వేక్షించి పరిష్కరించే గుణం మాజీ కార్పొరేటర్ వెంకట ప్రసాద్ కు సొంతం . పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీరు వంటివి ఏది రాకున్నా సమస్యలపై వెంటనే స్పందించి, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించడంలో ఆయన స్టైలే వేరు.ప్రజలతో నిరంతరం మమేకమై ఉండి, వారి అవసరాలను, ఇబ్బందులను తెలుసుకొని క్షేత్రస్థాయిలో ఉండి బాధ్యతాయుతంగా అయన పనితీరు ఉంటుంది.... స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణమే స్పందించి, అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించడం అయన నైజం.అనంతపురం పట్టణంలోని స్థానిక ఉమా నగర్ వీధిలో 5 రోజులుగా మోటార్ చెడిపోయి కుళాయిలకు నీరు రాక కాలనీవాసులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించారు.

# ఉరవకొండ తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్



**ఉరవకొండ - సూర్య వాస్తవం:** జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ ఉరవకొండ తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాచర్ల గ్రామానికి చెందిన ఒక వ్యక్తిగత ధృవీకరణ ప్రక్రియను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. దాంతో పాటు రికార్డుల నమోదు, భూముల వివరాల సరిపోలిక, ఆన్‌లైన్ ప్రక్రియలు ఎలా జరుగుతు న్నాయనే దానిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, రెవెన్యూ సేవలను అత్యంత పారదర్శకంగా, వేగంగా అందించాలని అధికారులను ఆదేశించారు. పనితీరును మెరుగుపరచడానికి మరియు ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి ఇలాంటి ఉన్నతాధికారుల తనిఖీలు ఎంతగానో దోహదపడతాయి.

# పేకాట శిబిరంపై పోలీసుల దాడి..

## - ఏడుగురు అరెస్ట్

**పెద్దవడుగూరు - సూర్య వాస్తవం:** మండల పరిధిలో పోలీసులు జూదరుల ఆట కట్టించారు. పొలాల్లో నిర్వహిస్తున్న ఒక పేకాట శిబిరంపై ఎస్సై ఆంజనేయులు తన సిబ్బందితో కలిసి అకస్మాత్తుగా దాడి చేశారు. రికార్డు సమకౌంట్ ప్రకారం ఏడుగురు జూదరు లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 25,800 నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్సై ఆంజనేయులు హెచ్చరిక గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పేకాట, మట్కా, క్రికెట్ బెట్టింగ్ వంటి ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు సాగినా సహించేది లేదు. ఇలాంటి వాటిపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత రహస్యంగా ఉంచుతాం.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad )